


ఇంటర్మీడియట్ బోర్డు ఆర్ఐవోగా లాలెప్ప



కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా ఇంటర్మీడియట్ బోర్డు రీజినల్ ఇన్‌స్పెక్షన్ ఆఫీసర్(ఆర్ఐవో)గా కర్నూలు కేవీఆర్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జి. లాలెప్పకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు జాయింట్ సెక్రటరీ ఎం. జయలక్ష్మి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం జిల్లా ఇంటర్మీడియట్ బోర్డు అధికారిగా పని చేస్తున్న సురేష్‌బాబు ఆర్ఐవో ఎఫ్ఏసీగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యం

- నగరంలో అభివృద్ధి చేసి చూపిస్తా
- ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటా
- బాధ్యతలు స్వీకరించిన నగరపాలక కమిషనర్ విశ్వనాథ్



బాధ్యతలు స్వీకరిస్తున్న నగర పాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్

కర్నూలు న్యూసిటీ, జూలై 11(ఆంధ్రజ్యోతి): నగరంలో పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తానని నగరపాలక సంస్థ కమిషనర్ విశ్వనాథ్ పేర్కొన్నారు. శుక్రవారం నగరపాలక కార్యాలయంలో ఆయన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆర్‌జీవీ కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్‌రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ఇన్‌చార్జి ఎస్ఈ శేషసాయి, సిటీ ప్లానర్(సీపీ) ప్రదీప్‌కుమార్ ఇతర అధికారులు, సిబ్బంది కమిషనర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ నగర అభివృద్ధి గురించి మాటల్లో చెప్పడం కంటే చేసి చూపిస్తేనే ప్రజలు నమ్ముతారన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని అన్నారు. స్వచ్ఛాంధ్రలో భాగంగా నగరాన్ని సుందరవనంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు. కార్యాలయంలో సిబ్బంది కొరతను అధిగమించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేస్తామన్నారు. నిధులను సద్వినియోగం చేసుకోవడంతో పాటు కేంద్రం నుంచి వచ్చే నిధులను వినియోగిస్తామని అన్నారు. నగరపాలక కార్యాలయం వెనుక నిర్మిస్తున్న నూతన భవనాన్ని వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతామన్నారు.

పోస్టల్ ఖాతా తెరవాలి

జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాధిక



మాట్లాడుతున్న రాధిక

కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలో చదివే ఎస్సీ విద్యార్థులు ఎన్‌పీసీఐ లింక్‌తో పోస్టల్ ఖాతాను తెరవాలని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాధిక తెలిపారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో ఏఎస్‌డబ్ల్యూవోలు, వార్డెన్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు వసతి గృహ సంక్షేమ అధికారులను గ్రూపుగా చేసి 'తల్లికి వందనం' పోస్టల్ అకౌంట్స్‌ను సత్వరమే ఓపెన్ చేయాల్సిందిగా తెలిపారు. పోస్టల్ అకౌంట్‌కు సంబంధించి విధి విధానాలను, నిబంధనలను వివరించారు. ప్రతి విద్యార్థి పోస్టల్ అకౌంట్‌ను ఓపెన్ చేసుకునేలా ఉద్యోగులందరూ సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఎవరూ నిర్లక్ష్యం వహించరాదన్నారు. సకాలంలో నిర్ణయించిన సమయంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఇదే భవనంలో ఏర్పాటుచేసిన డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి డిప్యూటీ డైరెక్టర్, ఏఎస్‌డబ్ల్యూవోలు, వార్డెన్లు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూవోలు మద్దిలేటి, కె.బాబు, జి. సుంకన్న, వార్డెన్లు డీసీ మదారి, సులోచనమ్మ, పరిమళ రాణి తదితరులు పాల్గొన్నారు.

ఎరువు్తుత్తి



ఆదోని మార్కెట్ యార్డు డీసీఎంఎస్ కేంద్రం వద్ద ఎరువుల కోసం బారులు



రైతుకు అడుగడుగునా కష్టాలు తప్పడం లేదు. వర్షాలు కురుస్తుండడంతో పంటల సత్తువ కోసం ఎరువులు చాలా అవసరం. అధికారులు ఎరువులు ఉన్నాయని చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. సహకార సంఘాలతో పాటు రైతు సేవా కేంద్రాల్లో అవసరమైన నిలువలు లేక ప్రైవేటు ఎరువుల వ్యాపారులపై ఆధారపడాల్సిన పరిస్థితి. ఆదోని డివిజన్‌లో 89 వేల లక్షల హెక్టార్లకు పైగా వివిధ పంటలను సాగు చేశారు. ప్రధానంగా పత్తి, వరి, వేరుశనగ, మిరప పంటలకు ప్రస్తుతం యూరియా చాలా అవసరం. ప్రైవేటు వ్యాపారుల వద్ద యూరియా కావాలంటే లింకు ఎరువు కొనాల్సిందే. వ్యవసాయ అధికారులు మాత్రం తూతూ మంత్రంగా తనిఖీలు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారు.

- కలత చెందుతున్న రైతన్న
- యూరియా కోసం డీసీఎంఎస్‌ల వద్ద పడిగాపులు
- వారం రోజులుగా దుకాణాల చుట్టూ ప్రదక్షిణలు
- ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించాల్సిన దుస్థితి
- లింక్ ఎరువులు కొంటేనే యూరియా
- తూతూ మంత్రంగా వ్యవసాయాధికారుల తనిఖీలు

ఆదోని అగ్రికల్చర్, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఎరువులు ఉన్నాయి, ఆందోళనవద్దని అధికారులు చెబుతున్న మాటలు నీటి మూటలయ్యాయి. వారం రోజులుగా ఎరువులు లభించక రైతులు అవస్థలు పడుతున్నారు. సహకార సంఘాల్లో, రైతుసేవా కేంద్రాల్లో నిలువలు లేక ప్రైవేటు ఎరువుల వ్యాపారులపై ఆధార పడాల్సిన పరిస్థితి. అవసరమైన ఎరువులతో పాటు వారు లింకు ఎరువులు కొనాల్సిందే అనే కండీషన్ పెట్టడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో ఆదోని మార్కెట్ యార్డులోని డిస్ట్రిక్ కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) వద్దకు రైతులు పరిగెడుతున్నారు. అక్కడా రెండు రోజులుగా అవసరమైన స్టాక్ లేకపోవడంతో పడిగాపులు కాస్తున్నారు.

అరకొర నిల్వలు..

డీసీఎంఎస్, రైతు సేవా కేంద్రాలలో ఎమ్మార్పీకే విక్రయిస్తుండడంతో రైతులు అక్కడకు అధికంగా ఎరువులు కొనుగోలుకు మొగ్గు చూపుతారు. అక్కడ అవసరమైన ఎరువులు అందుబాటులో లేకపోవడంతో రోజూ పడిగాపులు కాయాల్సిన పరిస్థితి. అరకొర నిల్వలు వస్తుండడంతో ఉదయమే ఆదోని మార్కెట్ యార్డ్‌లోని డీసీఎంఎస్ కేంద్ర వద్ద బారులు తీరుతున్నారు. గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల వ్యవసాయ శాఖ సిబ్బంది ఇటీవల బదిలీలు చేపట్టడంతో అక్కడ ఎరువులు అందుబాటులో లేవు. కొన్నిచోట్ల ఉన్న సిబ్బంది ఇంకా విధుల్లోకి చేరకపోవడంతో రైతులకు ఎరువుల కొరత ఏర్పడింది.

కర్ణాటక రైతులు సైతం..

ఆదోని రెవెన్యూ డివిజన్ కావడంతో ఇక్కడికి ఆదోని, కౌతాళం, పెద్దకడుబూరు, కోసిగి, ఆలూరు, మంత్రాలయం, ఆస్పరి, పత్తికొండ, హొళగుంద మండలాలకు చెందిన రైతులతో పాటు పక్కనే ఉన్న కర్ణాటక రైతులు సైతం ఎరువుల కోసం ఇక్కడి వస్తుంటారు. ఇతర ప్రాంతాలకు చెందిన రైతుల సైతం వచ్చి కొనుగోలు చేస్తుండడంతో ఈ ప్రాంత రైతులకు ఎరువులు లభించక అవస్థలు పడుతున్నారు. డివిజన్‌లో 89వేల లక్షల హెక్టార్లకు పైగా వివిధ పంటలను సాగు చేశారు. ప్రధానంగా పత్తి, వరి, వేరుశనగ, మిరప పంటలకు ప్రస్తుతం యూరియా చాలా అవసరం. ప్రైవేటు వ్యాపారుల వద్ద యూరియా కావాలంటే లింకు ఎరువు కొనాల్సిందే. మరికొంతమంది కాంప్లెక్స్ ఎరువులకు సైతం లింకు అంటగడుతున్నారు. మరోవైపు సందట్లో సడేమియాగా రూ.80 నుంచి రూ.130 వరకు బస్తాపై అధికంగా రైతులకు విక్రయిస్తున్నారు. వ్యవసాయ అధికారులు సైతం తూతూ మంత్రంగా తనిఖీలు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారు.

రెండు రోజులుగా తిరుగుతున్నా..



మాకు 30 ఎకరాల పొలం ఉంది. పత్తి, మిరప వేశాం. వర్షాలు కురవడంతో పంట ఎదుగుదలకు యూరియా చాలా అవసరం. ఎరువులు దొరకక రెండు రోజులుగా డీసీఎంఎస్ వద్ద పడిగాపులు కాస్తున్నాం. ఉదయం నుంచి వచ్చి వరుసలో నిలబడి ఎరువులు తీసుకుంటున్నాం.

● సరస్వతి, మహిళా రైతు, నాగనాతనహళ్లి

పంట దెబ్బతినే ప్రమాదం..



ఏడెకరాల పొలం ఉంది. 5 ఎకరాలు పత్తి, రెండు ఎకరాలు మిరపను సాగుచేశా. ఎరువులు దొరకడం లేదు. ప్రస్తుతం పంటలకు ఎరువులు చాలా అవసరం. సరైన ఎరువులు వేయకపోతే పంట దెబ్బ తినే ప్రమాదం ఉంది.

● దేవరాజు, సతేకూడ్లూరు

ఎరువుల కొరత లేదు



ఎరువుల కొరత లేదు. మార్క్‌ఫెడ్‌లో బఫర్ స్టాక్ కింద 1,843 మెట్రిక్ టన్నుల ఎరువు నిల్వ ఉంది. డీసీఎంఎస్ ఎప్పటికప్పుడు ఎరువులు కేటాయిస్తున్నాం. అక్కడ కొంతమంది ఇతర ప్రాంతాలకు చెందిన రైతులు రావడంతో ఇబ్బంది తలెత్తుతోంది. వీటితో పాటు గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల్లో రైతులకు 4500 బస్తాలు ఎరువులను అందుబాటులో ఉంచాం. ప్రైవేటు ఎరువుల దుకాణాల్లో లింక్ ఎరువుల రైతులకు అంటగడితే ఫిర్యాదు చేయొచ్చు.

● సుధాకర్, మండల వ్యవసాయాధికారి, ఆదోని



ఎరువుల కోసం నిరీక్షిస్తూ నేలపై కూర్చున్న రైతులు

గర్భధారణల మధ్య ఎడం ఉండాలి



పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): గర్భధారణల మధ్య ఎడం అవసరమని కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టర్ చాంబరులో ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ప్రపంచ జనాభా దినోత్సవం, బాల్య వివాహాలను నిరోధించాలనే అవగాహన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు, కౌమార గర్భాలను నివారించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శాంతికళ, జిల్లా కుష్ఠు, ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ ఎల్. భాస్కర్ పాల్గొన్నారు.

వ్యవసాయ సహకార సంఘాలకు చైర్మన్ల ఎంపిక 7

హామీలు తప్పుతున్న సీఎం



ర్యాలీలో పాల్గొన్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

- పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి
- ప్రజా సమస్యలను పక్కన పెట్టి పదవుల కోసం కుమ్ములాట
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ఆలూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీలను తప్పుతున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఆరోపించారు. శుక్రవారం ఆలూరు పట్టణంలో పార్టీ 12వ మహాసభ సందర్భంగా భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం పాత బస్టాండు వద్ద నిర్వహించిన బహిరంగ సమావేశం ఆలూరు మండల కార్యదర్శి రామాంజనేయులు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ అమరావతి పేరిట ప్రభుత్వం కోట్లాది రూపాయలు అప్పులు చేస్తున్నదన్నారు. ఎన్నికల ముందు రైతులకు రూ.20 వేలు పెట్టుబడి సాయం అందిస్తానని హామీ ఇచ్చి నేడు జాప్యం చేస్తున్నారని అన్నారు. జిల్లాలో పెండింగ్ ఉన్న ప్రాజెక్టులను, ఆలూరు ప్రాంతంలో వేదవతి ప్రాజెక్టును పూర్తి చేయాలన్నారు. టీడీపీ నాయకులు అభివృద్ధి మరిచి కుమ్ములాటలతోనే కాలయాపన చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి గిడ్డయ్య, జిల్లా నాయకులు భూపేష్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆవుల శేఖర్, జిల్లా కార్యదర్శి నబీ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త సేకరణకు ప్రత్యేక ప్రణాళికలు

- వ్యర్థాలతో కరెంటు ఉత్పత్తికి చర్యలు
- ఏపీ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్



మాట్లాడుతున్న పట్టాభిరామ్

కర్నూలు న్యూసిటీ, జూలై 11(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పరిధిలో చెత్త సేకరణకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్ పేర్కొన్నారు. శుక్రవారం నగరపాలక కార్యాలయంలో చెత్త సేకరణ, వేస్ట్ మేనేజ్‌మెంట్ తదితర అంశాలపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నగర పరిధిలోని గార్గేయపురం, జోహరాపురం డంపింగ్ యార్డులను పరిశీలించారు. అక్కడ తీసుకుంటున్న చర్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. వారికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. నగరంలో చెత్త డంపింగ్ లేకుండా ప్రభుత్వం అనేక రకాల చర్యలు చేపడుతున్నారు. ప్రతి రోజు నగరం నుంచి 200 నుంచి 225 టన్నుల చెత్త బయటికి వస్తుందన్నారు. నగరంలో ఇంటింటికి చెత్త సేకరణ కోసం ప్రత్యేకంగా 91 ఎలక్ట్రికల్ వాహనాలను కొనుగోలు చేసేందుకు టెండరు పిలిచినట్లు తెలిపారు. నగరపాలక సంస్థకు సంబంధించి వాహనాల కోసం ప్రత్యేకంగా ఒక డిపోను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. చెత్తలో మిగిలిన వ్యర్థాలతో కరెంటు ఉత్పత్తికి చర్యలు తీసుకుంటామన్నారు. నగరాన్ని త్వరలోనే చెత్తరహిత నగరంగా ప్రకటించేందుకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. సమావేశంలో కమిషనర్ పి.విశ్వనాథ్, అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిద్ధాపురంపై కూటమి ఫోకస్..!

పూడికకు గురైన అప్రోచ్ కెనాల్ ఇదే (ఫైల్)



సిద్ధాపురం ఎత్తిపోతల పథకంపై కూటమి సర్కార్ ప్రత్యేక దృష్టి సారించింది. ఆత్మకూరు, పాములపాడు మండలాల్లోని సుమారు 21,300 ఎకరాల పంట భూములకు రబీ సీజన్‌లో సాగునీరు అందించేందుకు గాను 2006 ఏప్రిల్ 20న అప్పటి ముఖ్యమంత్రి వైఎస్. రాజశేఖరరెడ్డి ఈ పథకానికి శంకుస్థాపన చేశారు. 2014లో టీడీపీ ప్రభుత్వం సిద్ధాపురం పథకాన్ని పూర్తి చేసి 2018 జనవరి 7న ప్రారంభించింది. తొలుత రూ.89.72కోట్ల వ్యయంతో ఈ పథకాన్ని నిర్మించాలని భావించినప్పటికీ అంచనాలు భారీగా పెరగడంతో రూ.116.52కోట్లు ఖర్చయింది. తాజాగా సుమారు రూ.80కోట్లతో మరిన్ని పనులకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి.

- వీబీఆర్‌లో 7.5 టీఎంసీల నుంచే నీటి ఎత్తిపోతలకు కసరత్తు
- యుద్ధప్రాతిపదికన అప్రోచ్ కెనాల్ పూడికతీత పనులు
- రెండు ప్రధాన తూము గేట్ల వద్ద భద్రత చర్యలు
- సుమారు రూ.80 కోట్లతో మరిన్ని పనులకు ప్రతిపాదనలు

ఆత్మకూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): సిద్ధాపురం ఎత్తిపోతల పథకం ద్వారా 21,300 ఎకరాలకు సాగునీరందించి ఆయకట్టును స్థిరీకరించాలనుకున్నారు. ఆత్మకూరు మండలంలో 17,950 ఎకరాలు, పాములపాడు మండలంలో 3,350 ఎకరాల ఆయకట్టును నిర్దేశించారు. ప్రధానంగా వెలుగోడు జలాశయంలో 5.6 టీఎంసీలకు నీటినిల్వలకు తగ్గకుండా ఉన్నప్పుడే వీబీఆర్ నుంచి సిద్ధాపురం చెరువులోకి 200 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోసేలా ప్రాజెక్ట్‌ను నిర్మించారు. ఇందులో భాగంగా స్టేజ్-1 పంప్‌హౌస్ నిర్మాణం చేపట్టి అక్కడి నుంచి రెండు భారీ మోటార్ల ద్వారా (ఒక్కో మోటారు 100 క్యూసెక్కుల సామర్థ్యం) నీటిని 40 అడుగుల ఎత్తులో నిర్మించిన సర్జ్‌ట్యాంక్‌లోకి ఎక్కిస్తారు. అక్కడి నుంచి గ్రావిటీ మీదుగా 6.750కిమీల దూరం అండర్ గ్రౌండ్ పైపులైన్ ద్వారా ప్రవహించి స్టేజ్-2 పంప్‌హౌస్‌లోకి చేరుతాయి. అక్కడ వున్న మరో రెండు భారీమోటార్ల ద్వారా నీటిని పంపింగ్ చేసి, 0.975కిమీల దూరంలో వున్న చెరువులోకి వీబీఆర్ జలాలు చేరుకునేలా ప్రాజెక్ట్‌ను నిర్మించారు. రెండు పంప్‌హౌస్‌లకు విద్యుత్ సరఫరా అందించేందుకు అండర్‌గ్రౌండ్ కేబుల్ ద్వారా విద్యుత్ తీగలను ఏర్పాటు చేసి 33/11 రెండు పవర్‌స్టేషన్‌లను నెలకొల్పారు. వీటికి ఆత్మకూరు 132/33 విద్యుత్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా జరుగుతోంది.

ఐదేళ్ల వైసీపీ పాలనలో అధ్వానంగా ప్రాజెక్ట్ నిర్వహణ

గత వైసీపీ ప్రభుత్వం సిద్ధాపురం పథకం రెగ్యులర్ మెయింటెనెన్స్ నిధులు ఇవ్వలేదు. దీంతో చెరువు కట్ట మీద కంపచెట్లు పెరిగాయి. కట్టపై కూడా గుంతలుపడ్డాయి. 2021 డిసెంబరు 5న ఎడమ ప్రధాన కాల్వ వద్ద చెరువు కట్టకు రంధ్రాలు పడ్డాయి. ఇరిగేషన్ అధికారులు నీటి లీకేజీలను అరికట్టారు. 2022 డిసెంబరు 15న ఎడమ ప్రధాన కాల్వ తూము గేట్ రాడ్ స్ట్రక్ అయింది. గేటు ఇనుప రేకులు ఒరిగిపోయాయి. సమీప పంట పొలాల్లోకి నీరు చేరి రైతులు నష్టపోయారు. వరిగడ్డి, కర్రలను అడ్డుగా వుంచి నీటి ప్రవాహాన్ని కట్టడి చేశారు. అలాగే స్టోన్‌డస్ట్‌తో తూమును తాత్కాలికంగా మూసివేశారు.

వీబీఆర్‌లో 7.5 టీఎంసీల నీటి ఎత్తిపోతలకు కసరత్తు

వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో 6టీఎంసీల నీటినిల్వలు ఉన్నట్లయితే అప్రోచ్ కెనాల్ ద్వారా స్టేజ్-1 పంప్‌హౌస్ వద్దకు నీరు చేరుతాయి. ఈ అప్రోచ్ కెనాల్‌లో పూడిక పేరుకుపోవడంతో వీబీఆర్‌లో 9.5టీఎంసీలు దాటిన తర్వాతే స్టేజ్-1 పంప్‌హౌస్ వద్దకు నీరు చేరుకుంటున్నాయి. దీని వల్ల సిద్ధాపురం ప్రాజెక్ట్‌కు నీరు అందడం ఆలస్యమవుతోంది.

మిగతా 6వ పేజీలో



బిల్లేకల్‌లో నీరు పోసి టమోటా మొక్కలు నాటుతున్న రైతులు

ఆటోల్లో నీరు తెచ్చి నాట్లు..

వరుణుడు ముఖం చాటేయడంతో రైతన్నకు కష్టాలు తప్పడం లేదు. జూలై నెలలో ఎండలు అధికమై తేమశాతం లేకపోవడంతో నీళ్లు పోసి టమోటా మొక్కలు నాటుతున్నారు. మండలంలోని బిల్లేకల్ గ్రామంలో నల్లన్న అనే రైతు శుక్రవారం ఆటోల్లో నీళ్లు తీసుకొచ్చి మొక్కమొక్కకు నీరుపోసి నాటు వేస్తున్నారు. 1.50 ఎకరాల పొలంలో టమోటా నారను ఎన్నో వ్యయ ప్రయాసలతో నాటుకున్నారు. వర్షాభావ పరిస్థితుల వల్ల ఈ యేడాది ఖరీఫ్‌లో వేసిన పంటలు ఎండిపోతుండడంతో నష్టాలు తప్పడం లేదని తెలిసినా ఇలా నీళ్లు తెచ్చి మొక్క మొక్కకు అందిస్తున్నాడు.

● ఆస్పరి, ఆంధ్రజ్యోతి





ఆటోలో తెచ్చిన నీరు పట్టుకుంటున్న రైతు, మహిళ

సిద్ధాపురంపై కూటమి ఫోకస్..!



సిద్ధాపురం చెరువు

(5వ పేజీ తరువాయి)

శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అప్రోచ్ కెనాల్‌లో పూడికతీత పనులకు రూ.20లక్షల నిధులను మంజూరు చేయించారు. దీని వల్ల వీబీఆర్‌లో 7.5 టీఎంసీల నీరు ఉన్నప్పటి నుంచే సిద్ధాపురం ప్రాజెక్టుకు నీరు అందిస్తున్నారు.

రెండు ప్రధాన తూము గేట్ల వద్ద భద్రతా చర్యలు

సిద్ధాపురం ప్రాజెక్ట్ పరిధిలోని కుడి, ఎడమ రెండు ప్రధాన తూములకు అప్పుడప్పుడు చిన్నరంధ్రాలు పడి నీరు లీకైన సందర్భాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రాజెక్ట్ భద్రతను దృష్టిలో ఉంచుకుని రెండు ప్రధాన తూముల వద్ద కాంక్రీట్ స్లేప్ పనులను చేపడుతున్నారు. తూము గేట్లకు మరమ్మతు పనులు చేసి నీరు వదిలే సమయంలో ఎలాంటి మొరాయింపు లేకుండా చర్యలు తీసుకున్నారు.

సుమారు రూ.80కోట్లతో మరిన్ని పనులకు ప్రతిపాదనలు

కూటమి ప్రభుత్వం వచ్చాక సిద్ధాపురం మట్టికట్టపై జంగిల్ క్లియరెన్స్ పూర్తి చేశారు. గుంతలను పూడ్చేశారు. రూ.25లక్షల వ్యయంతో అండర్ గ్రౌండ్ కరెంట్ కేబుల్ మరమ్మతులను, అప్రోచ్ కెనాల్‌లో పూడికతీత, తూము గేట్ల వద్ద కట్టుదిట్టమైన భద్రత చర్యలను పూర్తిచేశారు. ఇవికాక అండర్ గ్రౌండ్ కరెంట్ కేబుల్ తరచూ మరమ్మతులకు గురికావడంతో ఓవర్ హెడ్ కరెంట్ కేబుల్ ఏర్పాటుకు రూ.10కోట్లు, ప్రాజెక్ట్ ఆయకట్టు పరిధిలో పూర్తికాని బ్రాంచ్, ఫీల్డ్ కెనాల్స్ తూముల ఏర్పాటుకు మరో రూ.14కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అలాగే ఈ ప్రాజెక్టుకు అనుసంధానంగా వెంకటాపురం గ్రామ సమీపంలోని కుడి ప్రధాన కాల్వ నుంచి 6కిమీల దూరంలో శ్రీపతిరావుపేట, ఇందిరేశ్వరం, అమలాపురం, కృష్ణాపురం గ్రామాల పరిధిలోని సుమారు 5వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించేందుకు గాను రూ.25కోట్లతో ప్రతిపాదనలు రూపొందించారు. ఇవేకాకుండా వెలుగోడు జలాశయం నుంచి స్టేజ్-1 వరకు ఉన్న అప్రోచ్ కెనాల్ పూడికకు గురికాకుండా మరింత లోతులో కాంక్రీట్ బెడ్, ఇరువైపులా కాంక్రీట్ గోడల నిర్మాణానికి మరో రూ.30కోట్లతో ప్రతిపాదనలను సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించారు.

సకాలంలో నీరందిస్తే రైతుల జీవితాలు బాగుపడతాయి




సిద్ధాపురం ఆయకట్టు పొలాలకు సకాలంలో సాగు నీరందిస్తే రైతుల జీవితాలు మరింత బాగుపడతాయి. వీబీఆర్ నుంచి స్టేజ్-1 పంప్‌హౌస్ వరకు ఉన్న అప్రోచ్ కెనాల్‌లో తొలిసారిగా పూడికతీత పనులను చేయించాం. అప్రోచ్ కెనాల్‌లో పూడికతీత పనుల వల్ల వీబీఆర్‌లో 7.5టీఎంసీల నీటినిల్వలు ఉన్నప్పటి నుంచే సిద్ధాపురం నీరందించవచ్చు.

● బుడ్డా రాజశేఖరరెడ్డి, శ్రీశైలం ఎమ్మెల్యే

విద్యార్థుల కోసమే..

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధే కాదు.. విద్యార్థుల కోసం కూడా రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ఆలోచిస్తుంది. వారిలో పరీక్షల భయం, ఒత్తిడి, డిప్రెషన్ వంటి సమస్యలను అధిగమించేందుకు 'మానసిక ఆరోగ్య కౌన్సిలర్ల'ను నియమించింది. లక్ష్య సాధనలో ఎదురయ్యే ఇబ్బందులను తొలగించేందుకు వీరు ఎంతో సహాయపడుతారు. శిక్షణ పొందిన వారిని కెరీర్ మానసిక ఆరోగ్య కౌన్సిలర్‌లుగా నియమించారు. ఎడ్యుకేషన్ కన్సల్టెంట్ ఆఫ్ ఇండియా, సమగ్రశిక్ష అభియాన్ సంయుక్తంగా రాష్ట్రవ్యాప్తంగా 255 మందిని నియమించారు. నంద్యాల జిల్లాకు 12 మందిని కేటాయించారు. వీరంతా జిల్లా గర్ల్ అండ్ చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి పర్యవేక్షణలో పనిచేస్తున్నారు.





విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న కెరీర్ మానసిక ఆరోగ్య కౌన్సెలర్లు

- ● లక్ష్య సాధన కోసం 'కెరీర్ మానసిక ఆరోగ్య కౌన్సిలర్'
- ● ప్రభుత్వ పాఠశాలల్లో ముఖ్య భూమిక
- ● నంద్యాల జిల్లాలో 12 మంది నియామకం
- ● ఒక్కో కౌన్సిలర్‌కు 20 ప్రభుత్వ పాఠశాలలు

విద్యా వ్యవస్థలో ముఖ్య పాత్ర



ప్రభుత్వం నియమించిన కెరీర్ కౌన్సిలర్స్ విద్యావ్యవస్థలో ముఖ్యపాత్ర పోషిస్తున్నారు. శిక్షణ పొందిన నిపుణులను అందుబాటులోకి తెచ్చి విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో మద్దతు, మార్గదర్శకత్వం ఎంత ముఖ్యమో ప్రభుత్వం గుర్తించింది. సమగ్రశిక్షా అభియాన్ ద్వారా నియమించిన కౌన్సిలర్స్‌కు 18 నుంచి 20 ప్రభుత్వ పాఠశాలలను కేటాయిస్తున్నాం. విద్యార్థుల్లో మానసిక స్థైర్యాన్ని నింపేందుకు వీరు దోహదపడుతారు.

● ప్రేమంత్‌కుమార్, ఏపీసీ, సమగ్రశిక్షా అభియాన్, నంద్యాల

కౌన్సిలర్ల విధులు...

జిల్లాలోని జడ్పీ హైస్కూల్స్ కేజీబీవీలు, ఎంపీయూపీ, ఏపీ మోడల్ స్కూల్స్ రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి కౌన్సిలర్ 18 నుంచి 20 పాఠశాలలను ఎంపిక చేసుకుని విద్యార్థులకు వివిధ సేవలను అందించాలి. కెరీర్, మార్గదర్శకత, మానసిక ఆరోగ్యసేవలు, జీవన నైపుణ్యశిక్షణ, వ్యక్తిగత కౌన్సెలింగ్, పరీక్షల భయం, ఒత్తిడి, డిప్రెషన్ వంటి సమస్యలకు వ్యక్తిగత కౌన్సెలింగ్ ఇవ్వాలి. సైన్స్, ఆర్ట్స్, ఐటీఐ, పాలిటెక్నిక్ వంటి విద్యామార్గాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి. విద్యార్థుల ఆరోగ్యంపై వర్క్‌షాపులు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. విద్యార్థుల సామర్థ్యాలపై సైకోమెట్రిక్ పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి విద్యార్థి ప్రవర్తన, మార్పులపై వారికి వివరించాల్సి ఉంది. ప్రతి కౌన్సిలర్ విద్యార్థుల సామర్థ్యాలను లిఖితపూర్వకంగా నమోదు చేసి భవిష్యత్ ప్రణాళికకు సూచనలిస్తున్నారు. అవసరమనిపిస్తే విద్యార్థులను నిపుణుల వద్దకు పంపి వారిని నిరంతరం పర్యవేక్షించాలి.

ఆత్మ విశ్వాసం పెంచుతూ..



విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి, భవిష్యత్ నిర్మాణానికి కౌన్సిలర్ పాత్ర పునాది వేస్తుంది. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంచుతూ మంచి లక్ష్యాలను సాధించేలా చేయడమే లక్ష్యం. ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ విప్లవాత్మకమైన మార్పు విద్యార్థుల శ్రేయస్సుకు దోహదం చేస్తుంది.

● నాగసువర్చల, జీసీడీవో, నంద్యాల

వ్యక్తిగత కౌన్సెలింగ్‌తోనే ముందుకు..



విద్యార్థుల వ్యక్తిగత ఆసక్తులు, శక్తిసామర్థ్యాలను గ్రహించి వారి ఆకాంక్షలను అర్థం చేసుకుని కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నాం. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను సమన్వయం చేసి విద్యార్థులకు సరైన కెరీర్ గైడెన్స్ కల్పిస్తూ ముందుకు వెళ్తున్నాం.

● శ్రీరామ్, కెరీర్ కౌన్సిలర్, మిడ్తూరు మండలం

వర్క్‌షాపులు, సెమినార్లు నిర్వహిస్తున్నాం



మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో కలిసి వర్క్‌షాపులు, సెమినార్‌లు నిర్వహిస్తున్నాం. పాఠశాలల్లో కొత్తగా చేరిన విద్యార్థులకు కొత్త వాతావరణం అలవాటుపడేలా వారికి సహాయపడుతున్నాం.

● ప్రమీల, కెరీర్ కౌన్సిలర్, జూపాడుబంగ్లా మండలం

'పీ-4'ద్వారా పేదలకు ఆసరా

- ● కౌలుట్లయ్య కుటుంబానికి రూ.2లక్షల ఆర్థికసాయం
- ● మార్గదర్శిగా కంటి వైద్య నిపుణుడు డా. సుధాకర్‌రావు
- ● కలెక్టర్ పి. రంజిత్ బాషా



కౌలుట్లయ్యకు చెక్కును అందజేస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, జూలై 11(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర పీ-4 ఫౌండేషన్ ద్వారా పేద కుటుంబాలను ఆదుకుంటామని కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టర్ చాంబర్‌లో 'స్వర్ణాంధ్ర పీ-4 ఫౌండేషన్- మార్గదర్శి - బంగారు కుటుంబం' కింద గోనెగండ్ల నివాసి బోయ కౌలుట్లయ్య అనే రైతు కుటుంబానికి కలెక్టర్ రూ.2లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల బతుకుల్లో వెలుగులు నింపేలా స్వర్ణాంధ్ర పీ-4 ఫౌండేషన్ విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. గోనెగండ్లకు చెందిన బోయ కౌలుట్లయ్య పేదరికం వల్ల ఇబ్బందులు పడుతుండటంతో బంగారు కుటుంబంగా గుర్తించి మార్గదర్శిగా ముందుకు వచ్చిన సుశీల నేత్రాలయ వైద్యశాల కంటి వైద్య నిపుణుడు డాక్టర్ సుధాకర్‌రావు ద్వారా ఆర్థికసాయం అందించారు. రూ.2లక్షల డబ్బుతో పాడి గేదెలను కొనుగోలు చేసి జీవన ఉపాధి పొందాలని కౌలుట్లయ్యకు సూచించారు. మంచి పాడి గేదెలను చూసి ఇప్పించే విధంగా చర్యలు తీసుకోవాలని పశుసంవర్ధక శాఖ అధికారిని ఆదేశించారు. మిగిలిన డబ్బుతో ఏమైనా లోన్లు ఉంటే తీర్చేసుకుని వ్యవసాయం చేసుకోవాలని రైతుకు సూచించారు. బంగారు కుటుంబంగా గుర్తించిన కౌలుట్లయ్య కుటుంబానికి ఆర్థికసాయం అందించిన డాక్టర్ సుధాకర్‌రావును అభినందించారు. సుశీల నేత్రాల వైద్యశాల కంటి నిపుణుడు డాక్టర్ సుధాకర్‌రావు, జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి శ్రీనివాసులు, జిల్లా వ్యవసాయాధికారి వరలక్ష్మి పాల్గొన్నారు.

తల్లి భాషకు రక్షణ ఛత్రం పడదాం..!

- ● నేటి నుంచి రాష్ట్రస్థాయి తెలుగు భాషా పరిరక్షణ సదస్సు
- ● టీజీవీ కళాక్షేత్రానికి పలువురు ప్రముఖుల రాక



సమావేశంలో మాట్లాడుతున్న కేసీ కల్కూర

కర్నూలు కల్చరల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): తెలుగు వెలుగులు విరబూయిద్దాం.. అమ్మభాషకు రక్షణ ఛత్రం పడదామంటూ రాష్ట్రస్థాయి తెలుగు భాషా పరిరక్షణ సదస్సు కర్నూలు టీజీవీ కళాక్షేత్రం ఆడిటోరియంలో జరగనుంది. శనివారం, ఆదివారం జరిగే ఈ భాషా పరిరక్షణ సదస్సుకు రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి భాషా ప్రతినిధులు హాజరు కానున్నారు. ఈమేరకు శుక్రవారం టీజీవీ కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సదస్సు నిర్వాహక కమిటీ అధ్యక్షుడు కేసీ కల్కూర మాట్లాడుతూ మాతృభాషను ముందు తరాలకు అందించకపోతే అది మృతభాషగా మారిపోతుందన్నారు. సదస్సు ఉపాధ్యక్షుడు జేఎస్ఆర్‌కే శర్మ మాట్లాడుతూ శనివారం ఉదయం 10 గంటలకు కొండారెడ్డి బురుజు సమీపంలోని తెలుగు తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి భారీ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ ఈ సదస్సులో ప్రముఖుల, భాషావేత్తల అభిప్రాయాలను కలెక్టర్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిస్తామని అన్నారు. సదస్సు కార్యదర్శి డాక్టర్ దండెబోయిన పార్వతీదేవి మాట్లాడుతూ విశ్రాంత ఐఏఎస్ అధికారి ముక్తేశ్వరరావు, మద్రాసు తెలుగు భాషా సంఘం అధ్యక్షుడు తూమాటి సంజీవరావు, విశ్రాంత ఆర్‌యూ ఆచార్యులు రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి శనివారం సదస్సులో మాట్లాడతారని తెలిపారు.

15న జాబ్ మేళా

కర్నూలు అర్బన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా నిరుద్యోగుల కోసం ఈనెల 15న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి పి.దీప్తి తెలిపారు. నంద్యాల పట్టణంలోని జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో నిర్వహించే క్రెడిట్ అసెస్ జర్మన్ ప్రైవేట్ లిమిటెడ్, మహీంద్రా కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. ట్రైనీ మేనేజర్, టెక్నీషియన్ పోస్టులకు ఎంపికైన వారికి నెలకు రూ.15 వేల నుంచి 20వేల దాకా జీతం ఉంటుందని తెలిపారు. ఇంటర్, డిగ్రీ ఐటీఐ, ఎలక్ట్రీషియన్ పూర్తి చేసిన వారు ఈ పోస్టులకు అర్హులని తెలిపారు. వివరాలకు 99081 14205 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ముస్లిం విద్యార్థులకు ఉపకార వేతనాలు

నంద్యాల రూరల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పేద ముస్లిం విద్యార్థులకు ఈనెల 13న అంజుమాన్ షాదీఖానాలో ఉపకారవేతనాలు అందజేస్తున్నట్లు అంజుమన్ కమిటీ అధ్యక్షుడు ఖుద్దూస్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ విద్యాప్రగతిని సాధించేందుకు ఆర్థిక తోడ్పాటును కల్పించడానికి అంజుమాన్ కమిటీ సాయపడుతుందన్నారు. ఒక్కో విద్యార్థికి రూ.3వేల చొప్పున అందజేయనున్నట్లు తెలిపారు.

జనాభా సమతుల్యత పాటించాలి

- ● క్లస్టర్ వర్సిటీ రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లు
- ● సిల్వర్ జూబ్లీ కళాశాలలో ప్రపంచ జనాభా దినోత్సవం



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

కర్నూలు అర్బన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): జనాభా విషయంలో ప్రతి ఒక్కరూ సమతుల్యత పాటించాల్సిన అవసరం ఉందని క్లస్టర్ వర్సిటీ రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాలలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహించారు. ఆర్థిక శాఖ అధ్యాపకుడు డాక్టర్ జీ.ఎల్లకృష్ణ అధ్యక్షతన ఈ కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ జీవన ప్రయాణంలో జీవితాన్ని బ్యాలెన్స్‌గా చేసుకుని అడుగులు వేయాలన్నారు. నేటి యువత జీవితంలో ఉన్నతంగా స్థిరపడాలనే ఉద్దేశ్యంతో వివాహాలు వాయిదా వేస్తున్నారని, దీంతో జనాభా పెరుగుదల రేటు తగ్గిపోయే ప్రమాదం ఉందన్నారు. సిల్వర్ జూబ్లీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ 20ఏళ్ల తర్వాత యువశక్తి తగ్గిపోతుందని, జననాల రేటు తగ్గి పోవడమే ప్రధాన కారణమని అన్నారు. కళాశాల విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన వారికి సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంపై అవగాహన ర్యాలీ



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి

కర్నూలు లీగల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కక్షిదారుల మధ్య పెండింగ్‌లో ఉన్న వివాదాల పరిష్కారానికి మధ్యవర్తిత్వం విశేషంగా తోడ్పడుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి తెలిపారు. "మధ్యవర్తిత్వం- దేశం కోసం" అనే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఓ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యవర్తిత్వం గురించి ప్రచారం చేసేందుకు ఈ నెల 10వ తేదీ నుంచి 16వ తేదీ వరకు పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కక్షిదారులు తమ వివాదాలను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించేందుకు న్యాయవాదులు సహకరించాలన్నారు. ఆ తర్వాత ఆయన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ ఎం. వెంకట హరినాథ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హరినాథ్ చౌదరి, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఐదేళ్లు జగన్ అరాచకాలు

- ● రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్
- ● ఎమ్మెల్యే బీవీతో కలిసి ఎమ్మిగనూరులో 'తొలి అడుగు'
- ● మంత్రికి ఘనస్వాగతం, భారీ గజమాలతో సన్మానం



మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

ఎమ్మిగనూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లు రాష్ట్రంలో వైఎస్ జగన్ ఎన్నో అరాచకాలు చేశారని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ ఆరోపించారు. శుక్రవారం ఎమ్మిగనూరు పట్టణంలోని లక్ష్మీపేటలో 'తొలి అడుగు' కార్యక్రమంలో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డితో కలిసి పాల్గొన్నారు. మంత్రి టీజీ భరత్‌కు టీడీపీ శ్రేణులు ఘన స్వాగతం పలికి, భారీ గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాక్షసపాలన సాగించిన వైఎస్ జగన్ ఇప్పుడు మరోసారి పాదయాత్ర చేసి సీఎం అవుతానని అంటున్నారని, ఇది ఎలా సాధ్యమని ప్రశ్నించారు. సీఎం చంద్రబాబునాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం మంచి పాలన అందిస్తోందన్నారు. ఇంటింటికి వచ్చి సమస్యలు అడిగి తెలుసుకుంటున్నామన్నామని, ప్రజలు దీన్ని గమనించాలన్నారు. తల్లికి, చెల్లికి న్యాయం చేయని జగన్ ఐదు కోట్ల మంది ప్రజలకు ఎం న్యాయం చేస్తాడో ప్రజలు ఆలోచించాలన్నారు. మెగా టెక్స్‌టైల్ పార్కు స్థలం తిరిగి సాధించటానికి ఎమ్మెల్యే తీవ్రంగా శ్రమించారన్నారు.

మాటను నిలబెట్టుకున్న నారా లోకేశ్

ఎన్నికలకు ముందు ఇచ్చిన మాటను మంత్రి నారా లోకేశ్ నిలబెట్టుకున్నారని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. 'తొలి అడుగు' సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ జగన్ అందరికీ 'అమ్మ ఒడి' అంటూ ఒక్కరికే ఇచ్చారని విమర్శించారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు మహేష్, మాజీ కౌన్సిలర్ రామకృష్ణ నాయుడు, నాయకులు రామదాసు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



బహిరంగ సమావేశానికి హాజరైన టీడీపీ కార్యకర్తలు

జీవో నెంబర్ 20ని ఉపసంహరించాలి

- విద్యార్థుల జీవితాలతో చెలగాటం వద్దు
- ఏఐసీసీ సభ్యుడు, కర్నూలు జిల్లా కాంగ్రెస్ ఇన్‌చార్జి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐసీసీ సభ్యుడు

కర్నూలు అర్బన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): రెండేళ్ల పాటు ఇతర రాష్ట్రాల్లో ఇంటర్ చదివిన విద్యార్థుల పాలిట శాపంలా మారిన జీవో నెంబర్ 20ని తక్షణమే ఉపసంహరించాలని ఏఐసీసీ సభ్యుడు, కర్నూలు జిల్లా కాంగ్రెస్ ఇన్‌చార్జి జే.లక్ష్మీనరసింహ డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని చెక్ పోస్టులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్యాశాఖ ఇటీవల విడుదల చేసిన జీవో నెంబర్ 20 రాష్ట్ర విద్యార్థులకు ఇబ్బందికరంగా తయారైందన్నారు. ఈ జీవో ప్రకారం ఇంటర్మీడియట్ రాష్ట్రంలో చదివిన విద్యార్థులు మాత్రమే ఇంజనీరింగ్ అడ్మిషన్లకు అర్హులని చెప్పడంతో ఇతర రాష్ట్రాల్లో చదివిన విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి జీవో నెంబర్ 20ని ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో నంద్యాల జనరల్ సెక్రటరీ ఎస్ రజాక్ వలీ, కేకేసీ నంద్యాల జిల్లా చైర్మన్ పఠాన్ హబీబ్, జిల్లా సెక్రటరీ వెంకట నాయుడు, ఓర్వకల్లు మండలాధ్యక్షుడు విశ్వేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

మైనర్ల డ్రైవింగ్‌పై ప్రత్యేక దృష్టి

- ఆరు నెలల్లో 640 కేసులు నమోదు
- కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు క్రైం, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మితిమీరిన వేగంతో వాహనాలు నడుపుతూ ప్రమాదాలు తెచ్చిపెడుతున్న మైనర్లపై చర్యలు తీసుకునేందుకు ప్రత్యేక దృష్టి పెట్టామని ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మైనర్లకు వాహనాలు ఇచ్చినా.. వారు వాహనాలు నడిపినా చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే రూ.5వేలు జరిమానా విధిస్తామన్నారు. మరోసారి పట్టుబడితే తల్లిదండ్రులకు జైలు శిక్ష విధిస్తామని హెచ్చరించారు. మరలా రిపీట్ అయి ప్రమాదాలకు కారణమైతే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడమే కాక జీవితాంతం లైసెన్సును రద్దు చేస్తామన్నారు. ఎవరైనా మితిమీరిన వేగంతో సెల్‌ఫోన్లు మాట్లాడుతూ డ్రైవింగ్ చేసినా, సైలెన్సర్లు తీసి ద్విచక్రవాహనాలతో విన్యాసాలు చేసి ప్రజలకు ఇబ్బందులు కలిగించినా అలాంటి వారిపై చర్యలు తప్పవన్నారు. మైనర్ డ్రైవింగ్‌కు సంబంధించి ఆరు నెలల్లో 640 కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు.

రిటైర్డ్ ఏడీకి నోటీసులు

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా విద్యాశాఖలో పనిచేస్తూ పదవీ విరమణ పొందిన ఉదయ్‌కుమార్ అనే రిటైర్డ్ అసిస్టెంట్ డైరెక్టర్(ఏడీ)కు రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి కోన శశిధర్ నోటీసును జారీచేశారు. 2023వ సంవత్సరంలో చెక్‌బౌన్స్ కేసులో కోర్టు నుంచి వచ్చిన తాఖీదులతో ప్రస్తుతం గుంటూరు జిల్లాలో ఉంటున్న ఉదయ్‌కుమార్‌కు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నోటీసును పంపారు. 10 రోజుల్లోగా రాతపూర్వకంగా సరైన సమాధానం ఇవ్వాలన్నారు. వారికి సంబంధించిన అన్ని లావాదేవీలను నిలిపివేయాలని విద్యాశాఖను ఆదేశించారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

రుద్రవరం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ఘటన రుద్రవరం మండలం ముత్తలూరు గ్రామంలో శుక్రవారం చోటు చేసుకున్నది. ఎస్ఐ మహమ్మద్ రఫీ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన నంద్యాల భాస్కర్‌రెడ్డి(48) తనకు ఉన్న రెండు ఎకరాల పొలంతో పాటు మరో 19 ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని పంటలు సాగు చేసేవాడు. పంట దిగుబడులు సరిగా రాకపోవడంతో పంట పెట్టుబడుల కోసం రూ.19 లక్షలు అప్పులు చేశాడు. అప్పులను తీర్చలేక ఆలమూరు గ్రామ సమీపంలో ఉన్న దొడ్లవాగు సమీపంలో క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. గమనించిన గ్రామస్థులు చికిత్స నిమిత్తం కర్నూలులోని కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ కోలుకోలేక రైతు మృతి చెందాడు. మృతుడికి భార్య సుభద్రమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



భాస్కర్‌రెడ్డి (ఫైల్)

ఈర్లపాడులో మరో రైతు...

బండిఆత్మకూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈర్నపాడు గ్రామానికి చెందిన పెద్ద వెంకట సుబ్బయ్య (49) గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. ఎస్ఐ జగన్మోహన్ తెలిపిన వివరాలివీ.. పెద్ద వెంకట సుబ్బయ్య తనకున్న రెండున్నర ఎకరాల సొంత పొలంతో పాటు, మరో 13 ఎకరాల భూమిని గత మూడు సంవత్సరాలుగా కౌలుకు తీసుకొని వరి సాగు చేస్తున్నారు. అయితే వ్యవసాయంలో సరైన దిగుబడులు రాక, పెట్టిన పెట్టుబడులు అప్పులయ్యాని, దీంతో అప్పులు తీర్చలేనన్న మనస్తాపంతో గురువారం సాయంత్రం ఇంట్లోనే గడ్డి మందు తాగారు. బంధువులు చికిత్స నిమిత్తం నంద్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం సమయంలో మృతి చెందారు. పెద్ద వెంకటసుబ్బయ్యకు భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

స్థానికుల తొలగింపుపై దుమారం

- మాధవరం స్టీల్ ఫ్యాక్టరీ వద్ద నిరసనలు
- ఉద్యోగులను లోపలికి వెళ్లకుండా అడ్డుకున్న కార్మికులు



కార్మికులతో మాట్లాడుతున్న మాధవరం ఎస్ఐ విజయకుమార్

మంత్రాలయం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాధవరం గ్రామ సమీపంలో మారుతి ఇస్పాత్ ప్రైవేటు లిమిటెడ్ (మాధవరం స్టీల్ ఫ్యాక్టరీ)లో పని చేస్తున్న స్థానిక కార్మికులను తొలగించడంతో దుమారం రేగింది. రోజూ కొంత మందిని టార్గెట్ చేస్తూ యాజమాన్యం కార్మికులను తొలగించే నిర్ణయం తీసుకోవడంతో స్థానికంగా ఉండే కార్మికులు భగ్గుమన్నారు. దీంతో శుక్రవారం ఉదయం ఫ్యాక్టరీ ముఖద్వారం ముందు తమ బైకులను అడ్డుగా పెట్టి ధర్నా చేశారు. కార్మికులను తొలగించి కడుపు కొడుతున్నారంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఫ్యాక్టరీలోకి ఉద్యోగులను వెళ్లనీయకుండా.. లోపలి నుంచి ఉద్యోగులను బయటకు రానీయకుండా దాదాపు 5గంటలసేపు అడ్డుకున్నారు. దీంతో మాధవరం, మంత్రాలయం ఎస్ఐలు విజయకుమార్, శివాంజల్, హెడ్ కానిస్టేబుల్ రాముడు, పోలీసు సిబ్బందితో వచ్చి కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక కార్మికులు మాట్లాడుతూ స్థానికులను వదిలేసి ఒరిస్సా, బీహార్, రాజస్థాన్, మహారాష్ట్ర నుంచి కార్మికులను తీసుకువచ్చి పనులు చేయించుకుంటున్నారని మండిపడ్డారు. గురువారం రాత్రి పది మంది కార్మికులను తొలగించామని ప్రకటన చేయడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు రూ.25వేలు ఇచ్చిన వెట్టి చాకిరి చేస్తున్నామని, అదే బీహార్, ఒరిస్సా కార్మికులకు రూ.40వేల నుంచి రూ.50వేలకు ఇస్తున్నారని తెలిపారు. అనంతరం పోలీసులు ఫ్యాక్టరీ యాజమాన్యం ప్లాంట్ ఇన్‌చార్జి షమీర్, హెచ్ఆర్ జీఎం శ్రీనివాసులు, ప్లాంట్ హెడ్ రాకేష్ పాండే, ప్లాంట్ వైస్ ప్రెసిడెంటు సునీల్ సింగ్‌తో ఎస్ఐలు చర్చలు జరిపారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, మంచాల సొసైటీ చైర్మన్ రామకృష్ణారెడ్డి ఫ్యాక్టరీ యాజమన్యంతో చర్చలు జరిపారు. మరో రెండు రోజుల్లో ఫ్యాక్టరీ యాజమాన్యం సానుకూలంగా నిర్ణయం తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

వ్యవసాయ సహకార సంఘాలకు చైర్మన్ల ఎంపిక

- ఎమ్మిగనూరు నియోజకవర్గంలో రెండు సొసైటీలు
- ఆదోని నియోజకవర్గంలో మూడు సొసైటీలకు త్రిసభ్య కమిటీలు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



కడిమెట్ల విరుపాక్షిరెడ్డి



ఎన్వీ ఆంజనేయులు



ఎం.దామోదర్ చౌదరి



వి.అన్వర్ బాషా

కర్నూలు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు, ఆదోని నియోజకవర్గాల్లో ప్రాథమిక వ్యవసాయ పరస్పర సహకార సంఘాలకు (పీఏసీఎస్) ప్రభుత్వం త్రిసభ్య కమిటీలను ఎంపిక చేసింది. శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని డీసీవో వెంకటకృష్ణ, కేడీసీసీబీ సీఈవో రామాంజనేయులు తెలిపారు. ఎమ్మిగనూరు మండలం కడిమెట్ల పీఏసీఎస్ సొసైటీ చైర్మన్‌గా కడిమెట్ల విరుపాక్షిరెడ్డి, సభ్యులుగా రాళ్లదొడ్డి గ్రామానికి చెందిన కాపు మురళీకృష్ణారెడ్డిని, కడిమెట్లకు చెందిన బి.కేశన్నను నియమించారు. గోనెగండ్ల పీఏసీఎస్ సొసైటీ చైర్మన్‌గా అదే గ్రామానికి చెందిన ఎన్వీ రామాంజనేయులు, సభ్యులుగా కడపల రమేశ్, కురవ వెంకటేశ్వర్లును ఎంపిక చేశారు. ఆదోని నియోజకవర్గం పరిధిలో మదిరె పీఏసీఎస్ సొసైటీ చైర్మన్‌గా మండగిరికి చెందిన ఎం. ఆమోధర్ చౌదరి, సభ్యులుగా ఇస్వీ గ్రామానికి చెందిన దూదేకుల మగ్దుమ్ బాషా, సంగిపోగుల లక్ష్మమ్మ, పెద్దతుంబళం పీఏసీఎస్ సొసైటీ చైర్మన్‌గా వి. అన్వర్‌బాషా, సభ్యులుగా కొరవన్నగారి బసన్న, ఈడిగి శంకరప్పలను, పెద్ద హరివాణం పీఏసీఎస్ సొసైటీ చైర్మన్‌గా బి. ఆదిశేషిరెడ్డి, సభ్యులుగా తుంబలం గోవిందప్ప, సయ్యద్ బాషాలను ఎంపిక చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆదోని నియోజకవర్గంలో మూడు సొసైటీలకు టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కె.మీనాక్షినాయుడు ప్రతిపాదించిన వాళ్లనే ప్రభుత్వం నియమించింది.



బి.ఆది శేషిరెడ్డి

ఒక్క రూపాయి ఇవ్వలేదు

- ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న
- కలెక్టరేట్‌లోకి దూసుకెళ్లిన విద్యార్థి సంఘాల నాయకులు
- అడ్డుకున్న పోలీసులు.. తోపులాట
- అరెస్టుకు నిరసనగా గాంధీ విగ్రహం వద్ద బైఠాయింపు



అరెస్టుకు నిరసనగా గాంధీ విగ్రహం వద్ద బైఠాయింపు



అడ్డుకున్న పోలీసులు.. తోపులాట

కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): బడ్జెట్ సమావేశాల్లోనే రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.2,600 కోట్లు కేటాయించిందని, ఒక్క విద్యార్థికి కూడా ఒక్క రూపాయి ఇవ్వలేని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి పిలుపుమేరకు విద్యార్థులతో కలిసి కలెక్టరేట్ వద్ద పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్‌జీ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.షాబీర్‌బాషా, ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. శాంతియుతంగా ధర్నా చేస్తూ కలెక్టరేట్‌లోకి ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు దూసుకెళ్లేందుకు యత్నించారు. పోలీసులు, విద్యార్థి సంఘాల నాయకుల మధ్య తోపులాట జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ నాయకులు బందెల నాసర్‌జీ, ఎస్.షాబీర్‌బాషా మాట్లాడుతూ శాంతియుతంగా ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాలపై ఘర్షణకు దిగిన పోలీసు అధికారులు కూటమి ప్రభుత్వానికి పనిచేస్తున్నారని ఆరోపించారు. పేద విద్యార్థులకు, పీజీ విద్యకు శాపంగా మారిన జీవో.77ను రద్దు చేయాలని, అదే విధంగా పెండింగ్ ఫీజులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 'యువగళం' పాదయాత్రలో నారాలోకేశ్ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చాక తూతూ మంత్రంగా కేవలం రూ.600 కోట్లు విడుదల చేసి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా బకాయిలు విడుదల చేసి పేద విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్‌లోకి దూసుకెళ్లిన నాయకులను అరెస్టు చేసి సొంతపూచీకత్తు విడుదల చేశారు. ఈ అరెస్టుకు నిరసనగా గాంధీ విగ్రహం వద్ద రోడ్డుపై బైఠాయించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రంగస్వామి, శరత్ కుమార్, దామాస్, ఉపాధ్యక్షులు దస్తగిరి, వీరేష్, సిటీ అధ్యక్ష కార్యదర్శులు అభి, అశోక్, నాయకులు శేఖర్, అల్తాఫ్, శివ, మోహన్, వినోద్, హరీష్, విద్యార్థులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో చిన్నారి మృతి

బనగానపల్లె, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కైప గ్రామంలో కుక్కకాటుకు నాలుగేళ్ల చిన్నారి మధుప్రియ మృతి చెందింది. వివరాలివీ.. మండలంలోని కైప గ్రామానికి చెందిన జయరాముడు, రామేశ్వరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. రెండో కుమార్తె మధుప్రియ గురువారం రాత్రి అంగడికి వెళ్లి తిరిగి వస్తుండగా పాపపై కుక్కలు దాడి చేశాయి. దీంతో భయభ్రాంతులకు గురైన మధు ప్రియ భయపడి స్పృహ కోల్పోయి అపస్మారక స్థితికి చేరుకుంది. వెంటనే తల్లిదండ్రులు, బంధువులు బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అయితే చికిత్స పొందుతూ శుక్రవారం మధుప్రియ మృతి చెందింది.



మధుప్రియ (ఫైల్)

గోడ కూలి బాలుడి మృతి

పాణ్యం, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తొగర్చేడు గ్రామంలో శుక్రవారం గోడకూలి ముల్లా ఆరీఫ్ (5) మృతి చెందినట్లు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాము తెలిపారు. పాత ఇల్లు రిపేరి చేస్తుండగా పాత గోడ కూలి అక్కడే ఆడుకుంటున్న ఆరీఫ్‌పై గోడ కూలడంతో ఆరీఫ్‌తోపాటు తాత కరిముల్లాకు తీవ్రగాయాలయ్యారు. దీంతో హుటాహుటిన నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే ఆరీఫ్ మృతి చెందినట్లు తెలిపారు. ఆరీఫ్ తల్లిదండ్రులు షాహీన్, మహబూబ్ బాషా కోవెలకుంట్ల మండలం కొప్పెర్ల నివాసం. వీరికి ఇద్దరు కుమారులు కాగా పెద్ద కుమరుడు ఆరీఫ్ తన తాత వద్ద ఉంటున్నట్లు తెలిపారు. ఆర్ఐ రాము, వీఆర్వో రామేశ్వరమ్మ సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. పాణ్యం పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఎరువుల షాపులపై దాడులు

18.45 మెట్రిక్ టన్నుల ఎరువుల అమ్మకాలు నిలిపివేత



ఎరువుల షాపుల్లో తనిఖీ చేస్తున్న వ్యవసాయాధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎరువుల దుకాణాలపై వ్యవసాయాధికారులు దాడులు నిర్వహించారు. ఎరువులు గోదాముల్లో నిల్వలు చేస్తూ కృత్రిమ కొరత సృష్టిస్తున్నారంటూ 'నిల్వలు వదంతులు' అనే కథనానికి వ్యవసాయ యంత్రాంగం శుక్రవారం కదిలింది. జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు రెండు ప్రత్యేక బృందాలు జిల్లాలోని వివిధ గోదాములపై దాడులు చేశాయి. ఏడీఏ ఆంజనేయులు, మండల వ్యవసాయాధికారి ప్రసాద్, సాంకేతిక వ్యవసాయాధికారి కిశోర్, సహాయ వ్యవసాయ సంచాలకులు గిరీష్ ఆధ్వర్యంలో రెండు టీమ్‌లుగా ఏర్పడి ఉదయం నుంచి సాయంత్రం వరకు దాడులు నిర్వహించారు. నూనెపల్లెలో ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా స్టాక్ నిల్వచేసిన సుదర్శన్ ట్రేడర్స్‌కు చెందిన 18.45 మెట్రిక్ టన్నుల ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేశారు. ఈ సందర్భంగా డీఏవో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నంద్యాల జిల్లాలోని గోదాములు, ఎరువుల దుకాణాల యాజమానులు 1985 చట్టం ప్రకారం ఎరువుల వ్యాపారం చేయాలని అన్నారు. ఎరువుల నిల్వలను ప్రతిరోజు మండల వ్యవసాయాధికారులకు తెలియజేయాలన్నారు. రైతులకు ఎమ్మార్పీ ధరకు విక్రయించి రసీదును తప్పనిసరిగా ఇవ్వాలని ఆదేశించారు. చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

బాధ్యతలు చేపట్టిన ఈఈలు



జలవనరుల శాఖ పీడబ్ల్యూ డివిజన్ ఈఈగా బాధ్యతలు చేపట్టిన విజయరాజును అభినందిస్తున్న ఇంజనీర్లు



హంద్రీనీవా కర్నూలు డివిజన్-2 ఈఈగా బాధ్యతలు చేపట్టిన ప్రసాద్

కర్నూలు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): జలవనరుల శాఖ పబ్లిక్ వర్క్స్ (పీడబ్ల్యూ) ఎఫ్ఆర్ఎల్ కర్నూలు డివిజన్ ఈఈ (ఎఫ్ఏసీ)గా బి. విజయరాజు, హంద్రీనీవా ప్రాజెక్టు కర్నూలు డివిజన్-2 ఈఈ (ఎఫ్ఏసీ)గా ఎన్. ప్రసాద్ రావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. విజయరాజు 1996లో ఏఈఈగా జలవనరుల శాఖలో ఉద్యోగంలో చేరారు. ఆళ్లగడ్డ తెలుగుగంగ ప్రాజెక్టు, ఎమ్మిగనూరులో గురు రాఘవేంద్ర ప్రాజెక్టులో సుదీర్ఘకాలంగా పని చేశారు. 2014లో డీఈఈగా పదోన్నతిపై కడప జిల్లాకు బదిలీ వెళ్లారు. అనంతరం అక్కడి నుంచి గురురాఘవేంద్ర ప్రాజెక్టుకు బదిలీపై వచ్చారు. ప్రస్తుతం క్వాలిటీ సెల్ సబ్ డివిజన్ డీఈఈగా పని చేస్తున్న ఈయనకు ఎఫ్ఆర్ఎల్ డివిజన్ ఈఈగా పూర్తి అదనపు బాధ్యతలు ఇచ్చారు. ఎన్. ప్రసాద్ రావు బీటెక్ పూర్తి 1986లో ఇరిగేషన్ శాఖలో ఏఈఈగా ఉద్యోగంలో చేరారు. 2013లో డీఈఈగా పదోన్నతి పొందారు. కర్నూలు, అనంతపురం జిల్లాల్లో ఎక్కువ కాలం పని చేశారు. ప్రస్తుతం అనంతపురం జిల్లా బత్తలపల్లి టీబీపీ హెచ్చెల్సీ డీసీ సబ్ డివిజన్ డీఈగా పని చేస్తూనే కేసీ కెనాల్ కర్నూలు సబ్ డివిజన్ డీఈఈగా విధులు నిర్వహిస్తున్న ఆయనకు ప్రభుత్వం హంద్రీనీవా ప్రాజెక్టు కర్నూలు డివిజన్-2 ఈఈగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది.

ట్రాక్టర్ కింద పడి కార్మికుడి మృతి

కొలిమిగుండ్ల, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : నాపరాళ్ల లోడుకు వెళ్లి ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కింద పడి కార్మికుడు మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని అంకిరెడ్డిపల్లె గ్రామంలో శుక్రవారం జరిగిం ది. అంకిరెడ్డిపల్లెకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ తలారి వీరన్న, బండ చిన్న శ్రీరాములు(78) చింతలాయపల్లె పరిధిలోని నాపరాతి గనుల్లో ట్రాక్టర్లో బండలు లోడు చేసుకొని వస్తుండగా, ట్రాక్టర్ ఇంజన్‌పై కూర్చున్న బండ చిన్నశ్రీరాములు ఎగిరి కిందడ్డాడు. ట్రాక్టర్ అతని కాళ్లపై ఎక్కి వెళ్లడం తో మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమేష్‌బాబు వెల్లడించారు.

డ్రైనేజీలో గుర్తు తెలియని మహిళ మృతదేహం

నంద్యాల టౌన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రెండో పట్టణ పరిధిలోని రామనాథరెడ్డి నగర్‌లో చివరకు ఉన్న మురుగు కాలువలో గుర్తు తెలియన మహిళ శవం లభ్యమయినట్లు ఏఎస్పీ మందా జావళి తెలిపారు. మృతదేహం దుర్వాసన రావడంతో స్థానికులు సమాచారం ఇవ్వడంతో విచారణ చేస్తున్నామని ఆమె తెలిపారు. ఇక్కడే వేసి సుమారుగా మూడు నాలుగు రోజులు అయిండొచ్చునని తెలిపారు. ఆమెకు సుమారుగా 40 ఏళ్ల ఉండొచ్చని తెలిపారు. కాల్వలోని తీసినప్పుడు ఆమె వద్ద పర్సు కొంత డబ్బులు ఉన్నట్లు తెలిపారు. అయితే ఎటువంటి ఆధారాలు ఇంకా తెలియలేదని, బృందాలు ఏర్పడి విచారణ చేస్తున్నామని తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

దేవనకొండ, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : పురుగుమందు తాగి చికిత్స పొందుతూ ఓ యువకుడు మృతిచెందాడు. ఈఘటన మండలంలోని బంటుపల్లి గ్రామంలో చోటు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన సంజీవుడు, రాధమ్మ దంపతుల పెద్ద కుమారుడు శ్రీనాథ్ గౌడ్(16). అతడు పదో తరగతి వరకు చదువుకున్నాడు. ఇంటి వద్ద ఉంటూ ఆన్‌లైన్‌లో బెట్టింగ్ గేములు ఆడేవాడు. దాదాపు రూ.20 వేలకు పైగా ఖాతాలో డబ్బులు ఖాళీ చేయడంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్థాపానికి గురై గత నెల 9వ తేదీన పురుగుమందు తాగాడు. కుటుంబ సభ్యులు కర్నూలు వైద్యశాలకు తరలించారు. దాదాపు నెల రోజులుగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

లోకాయుక్త జోక్యంతో లైబ్రరీ సెస్సు వసూలు

కర్నూలు లీగల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని పలు స్థానిక సంస్థల నుంచి జిల్లాలోని గ్రంథాలయాలకు రావాల్సిన లైబ్రరీ సెస్సు రాష్ట్ర లోకాయుక్త జోక్యంతో వసూలైంది. ఈ మేరకు రాష్ట్ర లోకాయుక్త రిజిస్ట్రార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం, రామచంద్రాపురం, కాకినాడ, పిఠాపురం, తుని మున్సిపాలిటీలతో పాటు పలు స్థానిక సంస్థలు జిల్లాలోని గ్రంథాలయాలకు 2007 నుంచి 2017 వరకు రూ.3.67 కోట్లు బాకీ పడ్డాయి. ఈ మేరకు జిల్లాకు చెందిన సాంబశివరావు అనే వ్యక్తి రాష్ట్ర లోకాయుక్తకు ఫిర్యాదు చేయడంతో తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్‌కు లోకాయుక్త నోటీసులు జారీ చేసింది. దీంతో కలెక్టర్ విచారణ చేసి బకాయిలు ఉన్న మాట వాస్తవమేనని గ్రంథాలయాలకు ఆ మొత్తాన్ని చెల్లించేందుకు చర్యలు తీసుకున్నట్లు లోకాయుక్తకు తెలియజేశారు. దీంతో దశాబ్ద కాలంగా పెండింగ్‌లో రూ.3.67 కోట్లు లైబ్రరీ సెస్సు వసూలైనట్లు తెలిపారు. స్థానిక సంస్థల మధ్య జవాబుదారితనాన్ని పెంపొందించడానికి రాష్ట్ర లోకాయుక్త కృషి చేస్తున్నట్లు లోకాయుక్త రిజిస్ట్రార్ ఆ ప్రకటనలో తెలిపారు.

నగరాభివృద్ధికి కృషి

పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు న్యూసిటీ, జూలై 11(ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరాభివృద్ధికి కృషి చేస్తామని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. శుక్రవారం 45వ వార్డు అశోక్‌నగర్‌తోపాటు పలు కాలనీల్లో అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. మున్సిపల్ కార్పొరేషన్ సాధారణ నిధులు రూ.75.70 లక్షలు వెచ్చించి శ్రీనగర్ (రూ.49లక్షలు) అశోక్ నగర్ (రూ.17 లక్షలు)లలో మురుగునీటి కాలువలు అభివృద్ధి చేసేందుకు, శ్రీకృష్ణ కాలనీ (రూ.9.70 లక్షలు)తో రోడ్డు ఎత్తు పెంచడానికి ఈ నిధులు వినియోగించడానికి అను మతులు ఇచ్చామని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్‌ను మూడు నెలల లోపల తీసుకున్న పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. స్థానిక ప్రజలు పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. వీటిని కూడా పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సూపరింటెండెంట్ ఇంజనీర్ శేషసాయి, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్‌రెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గంగాధర్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ విశ్వేశ్వరరెడ్డి, కార్పొరేటర్ మాణిక్యమ్మ, ప్రసాద్, మురళి పాల్గొన్నారు.

ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రొత్సహిస్తాం: మంత్రి

కర్నూలు అర్బన్: ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తామని పరిశ్రమల శాఖమంత్రి టీజీ భరత్ అన్నారు. శుక్రవారం నగరంలోని సుంకేసుల రోడ్డులో ఉన్న సెయింట్ జోసెఫ్స్ డిగ్రీ కాలేజీలో నిర్వహించిన షై సిటీ.. షైరోల్ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో నగరంలోని పలు కాలేజీలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రతన్ టా టా ఇన్నోవేషన్ హబ్‌ను ఏర్పాటు చేస్తుందన్నారు. అనంతపురంలో ఏర్పాటు చేసే ప్రాంతీయ స్పోక్ కేంద్రాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పరిశ్రమలు వచ్చి రానున్న రోజుల్లో కర్నూలు ఊహించని విధంగా అభివృద్ధి చెందుతుందన్నారు.

సంతానోత్పత్తి రేటు పెంచాలి

సెట్కూరు సీఈవో వేణుగోపాల్


విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న సీఈవో వేణుగోపాల్

కర్నూలు స్పోర్ట్స్, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో సంతానోత్పత్తి రేటు పెంచాలని ప్రభుత్వం సూచించిందని సెట్కూరు సీఈవో వేణుగోపాల్ అన్నారు. శుక్రవారం పెద్దపాడు ప్రభుత్వ ఆదర్శ కళాశాలలో జనాభా పెరుగుదలపై అవగాహన కార్యక్రమం జరిగింది. వేణుగోపాల్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి జనాభా నిర్వహణపై అవగాహన ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి, విజేతలను బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఈరన్నరావు, సెట్కూరు పర్యవేక్షకులు శ్యాంబాబు, పాల్గొన్నారు.

కర్నూలు హాస్పిటల్: ప్రపంచ జనాభా దినో త్సవం సందర్భంగా జిల్లా వైద్యఆరోగ్య శాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శాంతికళ అవగాహన ర్యాలీని ప్రారంభించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ వివాహ వయస్సు అబ్బాయికి 21, అమ్మాయికి 18 సంవత్సరాలు ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా టీబీ ఆఫీసర్ డాక్టర్ ఎల్.భాస్కర్, డీపీఎంవో డాక్టర్ ఉమా, డీఐవో డా.నాగప్రసాద్‌బాబు, జిల్లా సంచార చికిత్స నోడల్ ఆఫీసర్ డా. రఘు, డీపీవో డా. సంధ్య, జిల్లా మలేరియా అధికారి నూకరాజు, ఎస్‌వో హేమసుందరం, డెమో శ్రీనివాసులు, డీపీవో విజయ రాజు, డీపీహెచ్‌ఎన్‌వో అన్నపూర్ణ, ఎంపీహెచ్‌డబ్ల్యూ ట్రైనింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

కోడుమూరు రూరల్: మండలంలోని లద్దగిరిలో పీహెచ్‌సీ సిబ్బంది విద్యార్థులతో కలిసి శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి భాస్కర్ మాట్లాడుతూ జనాభా పెరుగుదలకు, పేదరికం, ఆకలి, ఆరోగ్యం, విద్య, లింగ సమానత్వం వంటి అంశాలపై దృష్టి పెట్టడం, స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలను సాధించ డానికి జనాభా దినోత్సవం ముఖ్య సాధనంగా ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో శాంత, హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి శ్రీనివాస్ యాదవ్, సూపర్‌వైజర్ శారద పాల్గొన్నారు.


అవగాహన ర్యాలీలో పాల్గొన్న డీఎంహెచ్‌వో

కర్నూలు కల్చరల్: అధిక జనాభాతో విద్య, ఆరోగ్యం, ఉపాధి రంగాల్లో స్థిరత్వాన్ని కోల్పోతామని నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఆర్‌సీజేఐ) జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఎన్‌హెచ్‌ఆర్‌సీజేఐ, లయన్స్ క్లబ్ ఆఫ్ మెల్విన్ జోన్స్ సంయుక్త ఆధ్వర్యంలో, నగరంలోని బంగారుపేటలోగల మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాల్లో విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ 1990 నుంచీ ఐక్యరాజ్యసమితి సూచనల మేరకు ఏటా జూలై 11న ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏపీ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మురారి శంకరప్ప, ఉపాధ్యాయుడు రఘు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు న్యూసిటీ, జూలై 11(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.సుబ్బారాయుడు డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ అనుబంధ రాష్ట్ర సమితి పిలుపు మేరకు శుక్రవారం కలెక్టరేట్ ఎదుట జిల్లా కార్యదర్శి పులగం మద్దిలేటి అధ్యక్షతన కార్మికులు ధర్నా చేశారు. సుబ్బరాయుడు మాట్లాడుతూ గత ఎన్నికల్లో సీఎం చంద్రబాబు కార్మికుల సమస్యలన్నింటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. మున్సిపల్ అవుట్ సోర్సింగ్ కార్మికులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, మరణించిన అవుట్‌సోర్సింగ్ కార్మికుల కుటుంబసభ్యులకు తిరిగి పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప, నగర అధ్యక్షుడు వెంకటేష్, డిప్యూటీ కార్యదర్శి రామాంజ నేయులు, నాయకులు నల్లన్న, బాబులాల్, సవారి పాల్గొన్నారు.

వైద్యవిద్యలో అంకితభావం ముఖ్యం


టేబుల్ టెన్నిస్ ఆడుతున్న మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్

కర్నూలు హాస్పిటల్, జూలై 11(ఆంధ్రజ్యోతి): వైద్యవిద్యలో అంకితభావం ఎంతో ముఖ్యమని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ కె.చిట్టిన రసమ్మ, ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ పి.చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం కాలేజీలో నూతనంగా ఏర్పాటు చేసిన డిజిటల్ లైబ్రరీ, ఇండోర్ గేమ్స్ హాల్‌ను ప్రిన్సిపాల్ చిట్టినరసమ్మ, అకడమిక్ డీఎంఈ డా.రఘునందన్, కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లుతో కలిసి ప్రారంభించారు. అనంతరం ప్రిన్సిపాల్ చిట్టినరసమ్మ వైస్ ప్రిన్సిపల్ డా.రేణుకాదేవి ఇండోర్ గేమ్స్ హాలులో టేబుల్ టెన్నిస్ ఆడారు. అనంతరం కాన్ఫరెన్స్ హాలులో వైద్యులతో సమీక్ష నిర్వహించారు. అనస్థీషియా విభాగానికి లైఫ్ సపోర్టు స్కిల్స్ నేర్పించడానికి నెయిల్స్ ల్యాబ్ ఏర్పాటు, కమ్యూనిటీ మెడిసిన్ విభాగానికి వైద్య విద్యార్థుల ఫీల్డ్ విజిట్‌కు బస్సు కొనుగోలుపై చర్చించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ డా.సాయి సుధీర్, డా.హరిచరణ్, డా.రేణుకాదేవి, డా.విజయానందబాబు, డా.సింధియా శుభప్రద, డిప్యూటీ సూపరింటెండెంట్ డా.శ్రీరాములు, సీడీఎస్ సభ్యులు, ఏపీఎంఎస్ఐడీసీ ఇంజనీర్లు పాల్గొన్నారు.

మహానందిలో న్యాయాధికారి పూజలు

మహానంది, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో కర్నూలు జిల్లా నాలుగో అదనపు డిస్ట్రిక్ సెషన్స్ న్యాయాధికారి లీలావతి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం మహానంది ఆలయ ముఖమంటపం వద్ద ఇన్‌చార్జి పర్యవేక్షకుడు పసుపుల సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో న్యాయాధికారి అభిషేకార్చనలు చేశారు. వేదపండితులు ఆశీర్వదించి ప్రసాదాలు అందజేశారు.

ఆడపిల్లల చదువుకు అధిక ప్రాధాన్యం

కర్నూలు హాస్పిటల్, జూలై 11(ఆంధ్రజ్యోతి): హెచ్‌ఐవీతో జీవిస్తున్న ఆడపిల్లల చదువుకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని చైతన్యభారతి ప్రెసిడెంట్ ఎస్.విజయభాస్కర్ అన్నారు. శుక్రవారం నగరంలోని బుధవారపేట నేస్తం పాజిటివ్ నెట్‌వర్క్ సంస్థ ఆధ్వర్యంలో చైతన్య కళాభారతి ఎన్‌జీవో సంస్థ 14 మంది చిన్నారులకు ఎడ్యుకేషన్ మెటీరియల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కర్నూలు జీజీహెచ్ ఏఆర్‌టీ మెడికల్ ఆఫీసర్ డా.ఉదయణి, నేస్తం పాజిటివ్ నెట్‌వర్క్ సంస్థ అధ్యక్షురాలు బి.సుధారాణి, షేర్ ఇండియా ప్రాజెక్టు ఆఫీసర్ కే.రాజ్‌కుమార్, డా.ఎం.సుబ్బరాయుడు పాల్గొన్నారు.

వంట ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు కలెక్టరేట్, జూలై 11(ఆంధ్రజ్యోతి): స్థానిక బీక్యాంపులో గల ప్రభుత్వ బాలురు, బాలికల పాఠశాలల వంట ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు రాజు, మాలతి, శుక్రవారం కలెక్టర్ పి.రంజిత్ బాషాకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని పకడ్బందీగా నిర్వహిస్తోందని, ఈనెల 10న ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి పాఠశాలలో పేరెంట్స్ మీటింగ్ నిర్వహించారు కానీ.. నగరంలోని బీ.క్యాంపులో గల ప్రభుత్వ బాలురు, బాలికల పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని సరిగ్గా అమలు చేయడం లేదని ఆరోపించారు. ఈ మేరకు విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పేరెంట్స్ మీటింగ్ రోజు ఫిర్యాదు చేశారని, కాబట్టి ఆ రెండు పాఠశాలల వంట ఏజెన్సీలను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నిరక్షరాస్యతను నిర్మూలించాలి: జేసీ

కర్నూలు కలెక్టరేట్, జూలై 11(ఆంధ్రజ్యోతి): అక్షర ఆంధ్ర ద్వారా నిరక్షరాస్యతను నిర్మూలించాలని జాయింట్ కలెక్టర్ బి.నవ్య పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో అక్షరాంధ్ర కార్యక్రమం నిర్వహణపై లైన్ డిపార్టుమెంటు అధికారులతో జాయింట్ కలెక్టర్ జిల్లా స్థాయి సమన్వయ సమావేశం నిర్వహిం చారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ 2029 నాటికి ఆంధ్రప్రదేశ్‌లో 100 శాతం అక్షరాస్యత సాధించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేంగా అక్షర ఆంధ్ర కార్యక్రమం ప్రవేశపెట్టిందన్నారు. ఇందులో భాగంగా కర్నూలు జిల్లాలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ 15 నుంచి 59 సంవత్సరాల మధ్య వయస్సు గల 1,61,914 మంది నిరక్షరాస్యులను అభ్యాసకులుగా నమోదు చేసుకోవాలన్నారు. డీఆర్‌డీఏ, మెప్మా, ఎంజీఎన్ఆర్ఈజీఎస్ శాఖలు వారి పరిధిలో గల నిరక్షరాస్యులను గుర్తించి మ్యాచింగ్-బ్యాచింగ్ నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్ర మంలో వయోజన విద్య ఉప సంచాలకులు కే. చంద్రశేఖర్‌రెడ్డి, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ వైపీ రమణారెడ్డి పాల్గొన్నారు.

ఆందోళన జయప్రదం చేయండి: ఏఐవైఎఫ్

కర్నూలు న్యూసిటీ, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఉద్యోగాల భర్తీ కోసం ఈ నెల 14న రాష్ట్ర వ్యాప్తంగా జరిగే ఆందోళనను జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సీఆర్ భవన్‌లో జరిగిన ముఖ్య నాయకులు సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈనెల 14న కలెక్టరేట్ ఎదుట జరిగే ఆందోళనకు అధిక సంఖ్యలో నిరుద్యోగులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నగర అధ్యక్షుడు బి.నాగరాజు, కార్యదర్శి బీసన్న, ఆఫీసు బేరర్స్ అఖిల్, రవి, శివ పాల్గొన్నారు.

మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే

కర్నూలు రూరల్, జూలై 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి, బీజేపీ నేత సత్యకుమార్ యాదవ్‌ను ఆపార్టీ కోడుమూరు మాజీ ఎమ్మెల్యే పరిగెల మురళీకృష్ణ కలిశారు. శుక్రవారం సత్యసాయి జిల్లా ధర్మవరంలో జరిగిన పర్యటనకు మంత్రి వచ్చారు. ఈసందర్భంగా ఇటీవల కాంగ్రెస్ పార్టీ నుంచి బీజేపీలోకి చేరిన కోడుమూరు మాజీ ఎమ్మెల్యే మురళీకృష్ణ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కలిసి బోకె ఇచ్చారు. మురళీతోపాటు బీజేపీ ప్రధాన కార్యదర్శి మురళీ నాయుడు, నాయకులు ఉల్చాల లక్ష్మణ్ నాయుడు, ఎల్‌పేట తిప్పన్న నాయుడు, పసుపుల ప్రతాప్ ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్లూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): నెలవారి విద్యుత్ మరమ్మతు పనుల్లో భాగంగా నగరంలో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉం టుందని కర్నూలు ఏడీఈ నాగప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 9గంటల నుంచి మాధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని ఆయా కాలనీల్లో కరెంట్ ఉండదన్నారు. నగర ప్రజలు ఈ అసౌకర్యాన్ని గుర్తించి విద్యుత్ అధికారులు, సిబ్బందికి సహకరించాలన్నారు.

టీబీ వ్యాధిపై నిర్లక్ష్యం వద్దు

కోడుమూరు రూరల్, జూలై 11(ఆంధ్రజ్యోతి): టీబీ వ్యాధిని నిర్లక్ష్యం చేయకూడదని వైద్యాధికారి భాస్కర్ తెలిపారు. అనుగొండ గ్రామంలో సర్పంచ్ మాదమ్మ అధ్యక్షతన టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం పోస్టర్లు విడుదల చేశారు.

మందకృష్ణ మాదిగ సన్మాన సభ రేపటికి వాయిదా

కర్నూలు రూరల్, జూలై 11(ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఈనెల 12న (శనివారం) జరగాల్సిన మందకృష్ణ మాదిగ సన్మాన సభను రేపటికి (ఆదివారం) వాయిదా వేసినట్లు మాదిగ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ నాయకంటి మద్దయ్య మాదిగ శుక్ర వారం ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణమాదిగకు పద్మశ్రీ అవార్డు వచ్చిన నేపథ్యంలో ఏపీ ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ ఆఫీసర్స్ ఆధ్వర్యంలో చేపట్టే ఈసన్మాన సభ శనివారం నిర్వహించాల్సి ఉండగా, సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్ ఏపీ పర్యటనలో మంద కృష్ణ ఆయనను కలవనున్న నేపథ్యంలో సన్మాన సభ ఆదివారానికి వాయిదా వేసినట్లు ఆయన తెలిపారు.

నోటిఫికేషన్ జారీపై హర్షం

కర్నూలు హాస్పిటల్, జూలై 11(ఆంధ్రజ్యోతి): కర్నూలు జీజీహెచ్, కర్నూలు మెడికల్ కాలేజీలో 43 కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయడంపై ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్.బాలు నాయక్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం కర్నూలు జీజీహెచ్‌లో యూనియన్ కార్యాలయంలో ఆయన విలేకరులతో సమావేశం నిర్వహించారు. మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ పోస్టుల భర్తీ గురించి పలుమార్లు ప్రభుత్వానికి, ప్రజాప్రతి నిధులకు, అధికారులకు, ఎంఎస్‌వో, ఎఫ్ఎన్‌వో, పారామెడికల్ పోస్టులు భర్తీ చేయాలని ఒత్తిడి చేయడం, వినతి పత్రాలు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో జీజీహెచ్ శాఖ సెక్రటరీ ఖాజామొహిద్దీన్, కోశాధికారి సురేష్, హరిచంద్రనాయుడు పాల్గొన్నారు.

విధులకు సక్రమంగా హాజరు కావాలి

మండల సమావేశంలో ఎంపీటీసీ ఈరన్న గౌడు


ఎంఈవోను నిలదీస్తున్న ఎంపీటీసీ ఈరన్నగౌడు

సి.బెళగల్, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండల స్థాయి అధికారులు విధులకు సక్రమంగా హాజరు కావడంలేదని ఎంపీటీసీ ఈరన్న గౌడు ధ్వజమెత్తారు. మండల పరిషత్ కార్యాలయం సమావేశ భవనంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ బొంతల మునెప్ప అధ్యక్షతన జరిగింది. ఎంపీటీసీ ఈరన్న గౌడు మాట్లాడుతూ సి.బెళగల్ కస్తూర్బా పాఠశాలలో పనిచేస్తున్న ఎస్‌వో డ్రాప్ అవుట్ ఉన్న విద్యార్థులకు సీట్లు ఇవ్వకుండా తాను ఇష్టం వచ్చిన వారికి ఇస్తున్నారన్నారు. అయితే ఎంఈవో ఆదాం బాషా ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. పాఠశాల ఎస్ఓను బదిలీ చేయాలని ఎంపీటీసీలు, సర్పంచులు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎంపీడీవో రాణెమ్మ, పీఆర్ ఏఈ వెంకట్‌ప్రకాశ్, ఇరిగేషన్ ఏఈ సూర్యప్రకాశ్, డిప్యూటీ తహసీల్దార్ పురుషోత్తం, డిప్యూటీ ఎంపీడీవో మహేశ్వరమ్మ, గురుకుల ప్రిన్సిపాల్ చింతలయ్య, మండల వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి

కల్లూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఈనెల 14న కర్నూలు విద్యుత్‌భవన్ ముందు జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు టి.రాముడు, కల్లూరు పార్టీ కార్యదర్శి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శుక్రవారం 33, 37వ వార్డులు కల్లూరు, వీకర్‌సెక్షన్ కాలనీలో ఇంటింటికీ తిరిగి స్మార్ట్ మీటర్లు పెట్టడం వల్ల కలిగే నష్టాలను ప్రజలకు వివరించారు. సీపీఎం నాయకులు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు పెట్టవద్దని, పెట్టిన స్మార్ట్ మీటర్లను తొలగించాలని, విద్యుత్ బిల్లులను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఐద్వా జిల్లా కార్యదర్శి అలివేలమ్మ, కే.ప్రభాకర్, ఎం.భాస్కర్, జమ్మన్న పాల్గొన్నారు.

త్వరలో ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం నూతన అధ్యక్షుడి ఎన్నిక

కర్నూలు కలెక్టరేట్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం నూతన అధ్యక్షుడు ఎన్నిక త్వరలో నిర్వహిస్తామని ఏపీ ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, చిరంజీవి తెలిపారు. శుక్రవారం ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం కార్యాలయంలో వారు మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లా అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న నాగేశ్వర రావు పదవి కాలం పూర్తయిందని అన్నారు. ఆయనపై అవినీతి ఆరోపణలు రాష్ట్ర కమిటీకి ఫిర్యాదులు వచ్చాయని వెల్లడించారు.

ఉద్యోగ నియామకాలకు ఇంటర్వ్యూ

కర్నూలు కలెక్టరేట్, జూలై 11(ఆంధ్రజ్యోతి): మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులకు అర్హత కలిగిన వారికి శుక్రవారం డీఆర్వో వెంకట నారాయణమ్మ ఇంటర్వ్యూలు నిర్వహించారు. సోషల్ వర్కర్ కం ఇసీఈ పోస్టుకు ఇద్దరు అభ్యర్థులు, అసిస్టెంట్ కమ్ డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టుకు 16 మంది అభ్యర్థులు, జిల్లా ప్రాజెక్టు అసిస్టెంట్ పోస్టుకు నలుగురు అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరయ్యారు.

16న 'బుద్ధునితో నా ప్రయాణం' నాటక ప్రదర్శన

కర్నూలు కల్చరల్, జూలై 11(ఆంధ్రజ్యోతి): ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా కర్నూలు శాఖ ఆధ్వర్యంలో ఈనెల 16న సాయంత్రం 6 గంటలకు నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో 'బుద్ధునితో నా ప్రయాణం' తెలుగు నాటకం ప్రదర్శిస్తున్నట్లు జిల్లా గౌరవాధ్యక్షురాలు నాగమ్మ పూలే, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం నక్కలమిట్ట శ్రీనివాసులు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాటకం వివరాలు తెలిపే కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నాటక ప్రదర్శన వల్ల బుద్ధుడు, అంబేడ్కర్‌ల గురించిన అనేక విషయాలు తెలుస్తాయని అన్నారు. కార్యక్రమంలో సామాజిక ఉద్యమ నాయకులు కొమ్ముపాలెం శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షుడు పుసులూరి చిరంజీవి, కేవీపీఎస్ నాయకుడు ఆనంద్‌బాబు, బహుజన విద్యావంతుల వేదిక నాయకుడు జేవీ కృష్ణయ్య, బహుజన టీచర్స్ అసోసియేషన్ నాయకుడు డి. రామశేషయ్య, నంది విజయలక్ష్మి పాల్గొన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచండి: ఎంపీడీవో

కోడుమూరు రూరల్, జూలై 11(ఆంధ్రజ్యోతి): గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీవో రాముడు ఆదేశించారు. మండలంలోని అనుగొండ, ఎర్రదొడ్డి, గోరంట్ల గ్రామాల్లో శుక్రవారం ఆయన పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణపై తనిఖీ చేపట్టారు. అలాగే అంగన్‌వాడీ సెంటర్లు తనిఖీ చేసి చిన్నారులు, బాలింతలకు అందిస్తున్న ఆహారంపై సమీక్షించారు. గోరంట్ల జడ్పీహెచ్‌ఎస్‌లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకాన్ని పరిశీలించారు.

జిల్లా ప్లీనరీ సమావేశాలను జయప్రదం చేయండి: ఎస్ఎఫ్ఐ

కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరులో ఈ నెల 26, 27వ తేదీల్లో జరిగే ఎస్ఎఫ్ఐ 48వ జిల్లా ప్లీనరీ సమావేశాలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్లా, రంగప్ప కోరారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో సమావేశానికి సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు అమర్, ప్రకాష్, విశ్వ పాల్గొన్నారు.

ముగిసిన టీటీడీ ధార్మిక కార్యక్రమాలు


తమ్మరాజుపల్లెలో గోపూజ చేస్తున్న మహిళలు

పాణ్యం, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఈ నెల 8 వతేదీన తమ్మరాజుపల్లెలోని రామేశ్వరస్వామి దేవస్థానంలో ప్రారంభమైన టీటీడీ ధార్మిక కార్యక్రమాలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భం గా ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు గోపూజ నిర్వ హించారు. శ్రీమద్రామాయణం, మహాభారతం, భగవద్గీతపై చేసిన ప్రవచనాలు భక్తులను మంత్రముగ్దులను చేశాయి. టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకుడు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి మాట్లాడుతూ సంపద కన్నా సంస్కారం గొప్పది అని అన్నారు. అయితే నేటి యువత సంపదను వరించి సంస్కారాన్ని వదలివేస్తున్నారని అన్నారు. కార్యక్ర మంలో నంబూరు శ్రీ కాళీవనాశ్రమం పురాణ ప్రబోధకులు శ్రీని వాస రామానుజదాసు. సర్పంచ్ విజయగౌరి, ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, మధు, పార్థసారధి, విశ్రాంత ఆర్ఐ వెంకటరెడ్డి, దుబాయ్ శీను, వెంకటసుబ్బయ్య, పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్లలో తనిఖీ

కర్నూలు క్రైం, జూలై 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం గంజాయి, మత్తు పదార్థాల అక్రమ రవాణ నిర్మూలనే లక్ష్యంగా తీసుకున్న నేపథ్యంలో పోలీసులు రైల్వేస్టేషన్లలో తనిఖీలు చేశారు. శుక్రవారం స్థానిక పోలీసులు, ఈగల్ టీమ్, స్పెషల్ పార్టీ పోలీసులు, డాగ్ స్క్వాడ్ బృందాలు, రైల్వే ఆర్‌పీఎస్, జీఆర్‌పీ పోలీసులు సంయుక్తంగా రైల్వేస్టేషన్లలో, రైళ్లలో తనిఖీలు చేశారు. కాచిగూడ నుంచి గుంటూరుకు కర్నూలు మీదుగా వెళ్లే గుంటూరు ఎక్స్‌ప్రెస్ రైలులో బోగీలను తనిఖీలు చేశారు. ఈ తనిఖీలలో ఈగల్ టీం ఎస్ఐ సుజన్ కుమార్, కర్నూలు టూటౌన్ ఎస్ఐ సతీష్ కుమార్‌యాదవ్, ఈగల్ టీం పోలీసులు, డాగ్స్ స్క్వాడ్ పోలీసులు, రైల్వే ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ పోలీసులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన మున్సిపల్ కమిషనర్

కర్నూలు కల్చరల్, జూలై 11(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ నూతన కమిషనర్‌గా నియమితులైన పి.విశ్వనాథ్ శుక్రవారం బాధ్యతలను చేప ట్టారు. అనంతరం పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, కర్నూలు పార్లమెంటు సభ్యుడు బస్తిపాటి నాగరాజులను మర్యాదపూర్వకంగా కలిశారు. వారికి పుష్పగుచ్చాలు అందజేశారు. అనంతరం నగర అభివృద్ధికి తీసుకోవా ల్సిన చర్యలపై చర్చించారు.

ఎన్నికల నియమావళి మేరకు పనిచేయాలి

కల్లూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): బీఎల్‌వోలు ఎన్నికల నియమావళి మేరకు పని చేయాలని కల్లూరు తహసీల్దార్ కె.ఆంజనేయులు అన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో కల్లూరు తహసీల్దార్ నాలుగో రోజు బీఎల్‌వోలకు శిక్షణ ఇచ్చారు. డిప్యూటీ తహసీల్దారు విష్ణుప్రసాద్, ఎలక్షన్ డీటీ అనూరాధ, ఆర్ఐలు శ్రీనివాసరెడ్డి, రంగస్వామి, బీఆర్వో ఖాదర్ బాషా పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాడుదాం

కర్నూలు న్యూసిటీ, జూలై 11(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై పోరాడుదామని కర్నూలు నగర ప్రగతి సమితి వ్యవ స్థాపక అధ్యక్షుడు ఎం.శ్రీహర్ష అన్నారు. శుక్రవారం బిర్లా కాంపౌం డులోని సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దశాబ్దాల నుంచి జిల్లా వెనుకబాటుకు గురవుతూనే ఉందన్నారు.

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం


హుశేనాపురంలో కరపత్రాన్ని అందిస్తున్న నాయకుడు మహబూబ్ బాషా

ఓర్వకల్లు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ సీనియర్ నాయకుడు, క్లస్టర్ ఇన్‌చార్జి ఎస్.మహబూబ్ బాషా అన్నారు. శుక్రవారం మండలంలోని హుశేనాపురం గ్రామంలో సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా టీడీపీ నాయకులు ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి అన్వర్‌బాషా, నాయకులు జీకే సుధాకర్, కాటినేని నారాయణ, బజారు, జయకృష్ణ, షాషావలి, వేణు, సుమంత్‌శెట్టి, పాల్గొన్నారు.

గూడూరు: చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తుందని టీడీపీ మండల అధ్యక్షుడు జె సురేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని వై కానాపురం గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న జె సురేష్ టీడీపీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

జేవీవీ మహాసభలకు కర్నూలు కళాకారులు


జెండా ఊపి వాహనాలను సాగనంపుతున్న పత్తి ఓబులయ్య

కర్నూలు కల్చరల్, జూలై 11(ఆంధ్రజ్యోతి): జన విజ్ఞాన వేదిక (జేవీవీ) ఆధ్వర్యంలో కడప జిల్లా కేంద్రంలో శనివారం, ఆదివారం రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న 18వ రాష్ట్ర మహాసభలకు కర్నూలుకు చెందిన జేవీవీ కళాకారులు శుక్రవారం తరలివెళ్లారు. శుక్రవారం నగరం లోని టీజీవీ కళా క్షేత్రం వద్ద కళాకారుల వాహనానికి కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య జెండా ఊపి ప్రారంభించారు. అంతకు ముందు ఏర్పాటు చేసిన సమావేశంలో జేవీవీ జాతీయ సలహాదారుడు, గజల్ గాయకుడు మహ్మద్‌మియా మాట్లాడుతూ జేవీవీ కళాకారులు సైన్స్‌ను ఆధారంగా చేసుకొని అనేక అంశాలను శాస్త్రీయంగా ఆలోచించాలన్నారు. కడపలో జరిగే 18వ రాష్ట్ర మహాసభలకు సుమారు 23 జిల్లాల నుంచీ జేవీవీ ప్రతినిధులు, కళాకారులు హాజరవుతున్నారని, జేవీవీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వి.బ్రహ్మారెడ్డితో పాటూ అనేక మంది శాస్త్రవేత్తలు ఈ సభల్లో పాల్గొంటున్నారన్నారు. కార్యక్రమంలో సామాజిక వేత్త కేసీ కల్కూర, అధ్యాపకురాలు డాక్టర్ దండెబోయిన పార్వతీదేవి, టీజీవీ కళాక్షేత్రం కళాకారుడు కేవీ రమణ, జేవీవీ సభ్యులు వీరేష్, దుప్లిస్టు బద్రి పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీలో చేరిక

కర్నూలు అర్బన్, జూలై 11(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ కార్మికులు ఐఎన్‌టీయూసీలో చేరారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బి.బ్రతుకన్న సమక్షంలో మున్సిపల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ విభాగాల్లో పని చేసే కార్మికులకు కండువా కప్పి ఆహ్వానించారు. రెపల్లె ప్రతాప్, సయ్యద్ నవీద్, లాజరస్ పాల్గొన్నారు.

'సుఖీభవ' జాబితాను సరి చూసుకోండి

తుగ్గలి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకం పొందడానికి జాబితాను సిద్ధం చేశామని, ఆ జాబితాలో పేర్లు రైతులు సరి చూసుకోవాలని మండల వ్యవసాయాధికారి సురేష్ తెలిపారు. శుక్రవారం తుగ్గలి వ్యవసాయ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మండలంలో 13,332 మంది రైతులు ఉండగా.. 13,155 మంది ఈకేవైసీ పూర్తయింది. 74 మంది ఈకేవైసీ చేయించుకోవాలని, 103 మంది ఈకేవైసీ రిజెక్టు అయిందని, రిజెక్టు అయిన వారు, ఈకేవైసీ వేయని వారు వెంటనే ఈకేవైసీ చేయించుకోవాలన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆదోని, జూలై 11(ఆంధ్రజ్యోతి): కౌతాళం మండలంలోని తిప్పలదొడ్డి క్రాస్ వద్ద సురేష్ అనే వ్యక్తి నుంచి 10 బాక్సుల కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ సైదుల్లా తెలిపారు. శుక్రవారం వాహనాల తనిఖీలు చేస్తుండగా సురేష్ పోలీసులను గమనించి ద్విచక్ర వాహనాన్ని వదిలి అక్కడి నుంచి పరారయ్యాడన్నారు. ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి అందులో ఉన్న మద్యాన్ని స్వాధీనం చేసుకొని, సురేష్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న లబ్ధిదారులు

ఆదోని, జూలై 11(ఆంధ్రజ్యోతి): అనారోగ్యానికి గురై చికిత్స పొందిన 5 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.1.39 లక్షల చెక్కుల ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారధి శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. ఎదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఒక వరమని ఎమ్మెల్యే అన్నారు.

ఆస్పరి: అనారోగ్యంపాలై ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్న ఆస్పరికి చెందిన సలీంబాషాకు సీఎం సహాయ నిధి కింద రూ.2,15,273 చెక్కును ఎంపీ బస్తిపాటి నాగరాజు అందజేశారు. అలాగే హొళగుంద మండలానికి చెందిన మహాలక్ష్మి అనే మహిళకు రూ.67 వేలను సీఎం సహాయ నిధి కింద ఎంపీ అందజేశారు.

కొత్త మాస్టర్ ప్లాన్ ప్రకారంగానే మంజూరు

ఆదోని టౌన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పరిధిలోని కొత్త మాస్టర్ ప్లాన్ అమలులోని రావడంతో దాని ప్రకారంగానే ప్లాను మంజూరు చేయడం జరుగుతుందని మునిసిపల్ ఇన్‌చార్జి అసిస్టెంట్ సిటీ ప్లానర్ బాల ముద్దయ్య అన్నారు. పట్టణ ప్రణాళిక విభాగంలో శుక్రవారం ఎల్‌టీపీలు, సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులతో ఓపెన్ ఫోరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్లాను మంజూరు లేకుండా నిర్మాణాలు చేయరాదని, అలాంటి నిర్మాణాలపై కఠినంగా వ్యవహరించడం జరుగుతుందన్నారు. సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు తమ పరిధిలోని అక్రమ కట్టడాలపై దృష్టి సారించి యజమానులకు ప్లాన్ మంజూరు పై అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో ఎల్‌టీపీలు, సచివాలయ ప్లానింగ్ కార్యదర్శి సందేహాలకు ఆయన సమాధాలను ఇచ్చారు.

టీడీపీకి రాజీనామా

మద్దికెర, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొజ్జనాయునిపేట గ్రామానికి చెందిన మద్దికెర కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల చైర్మన్ లక్ష్మీదేవి, టీడీపీ నాయకులు శేఖర్ తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేశారు. శుక్రవారం వారు మాట్లాడుతూ టీడీపీ కోసం ఎనలేని కృషి చేశామని, అయితే.. వ్యక్తిగత కారణాల వల్ల పార్టీకి రాజీనామా చేసినట్లు మండల అధ్యక్షులకు సమాచారం ఇచ్చామని తెలిపారు. తాము ఏ పార్టీలోకి వెళ్లడం లేదని అన్నారు.

ఆరోగ్యమే మహా భాగ్యం

మద్దికెర, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యమే మహాభాగ్యం అని ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని ప్రభుత్వ వైద్యాధికారి శ్రీలక్ష్మి అన్నారు. శుక్రవారం స్థానిక హెల్త్ సెంటరులో ప్రపంచ ఆరోగ్య దినోత్సవంపై అవగాహన ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో నిరంజన్‌బాబు, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ అక్బర్ బాషా, ఆరోగ్య పర్యవేక్షకులు కృష్ణమ్మ, సూర్యనారాయణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ కోతలు

మద్దికెర, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మద్దికెర గ్రామంలో శనివారం విద్యుత్ కోత ఉంటుందని విద్యుత్ ఏఈ మహ్మద్ రఫీ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేస్తుండటం వల్ల శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ ఉండదని, ప్రజలు సహకరించాలని తెలిపారు.

పత్తికొండటౌన్: పత్తికొండ పట్టణం, మండలంలోని గ్రామాల్లో నేడు (శనివారం) ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ మహేశ్వర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రెండో శనివారం కావడంతో ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు చేపడుతున్నందున విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు కలెక్టర్‌కు వినతి

తుగ్గలి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాతనలో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేస్తామని టీడీపీ తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు మనోహర్ చౌదరి అన్నారు. శుక్రవారం కర్నూలు కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ రంజిత్ బాషాను కలిసి ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు కోసం పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు ఇచ్చిన లెటరును కలెక్టర్‌కు అందించారు. ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు కోసం అనుమతి ఇవ్వాలని కోరారు. స్పందించిన కలెక్టర్ త్వరలోనే అనుమతులు మంజూరు చేస్తామని చెప్పినట్లు తెలిపారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న మనోహర్ చౌదరి

మండల బీజేపీ అధ్యక్షుడిగా శంకర్‌బాబు



మద్దికెర, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బురుజుల గ్రామానికి చెందిన సీనియర్ బీజేపీ నాయకులు కురువ శంకర్‌బాబును బీజేపీ మండల అధ్యక్షులుగా నియమించినట్లు బీజేపీ జిల్లా అధ్యక్షులు తోటా రామకృష్ణ ఉత్తర్వులు పంపారు. శుక్రవారం శంకర్‌బాబు మాట్లాడుతూ మండలంలో బీజేపీ అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు. మండల అధ్యక్షులుగా తన ఎంపికకు సహకరించిన జిల్లా మాజీ అధ్యక్షులు నాగరాజు యాదవ్, కళాకారుల అధ్యక్షులు రామ్మోహన్, మాజీ మండల అధ్యక్షులు శ్రీనివాసులు, అడ్వకేట్ చంద్రశేఖర్ యాదవ్, గోవర్ధన్ నాయుడులకు కృతజ్ఞతలు తెలిపారు.

గెస్ట్ ఫ్యాకల్టీ కోసం దరఖాస్తు చేసుకోవాలి

ఆదోని అగ్రికల్చర్, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న హిస్టరీ సబ్జెక్టు బోధించేందుకు అర్హత కలిగిన వారు గెస్ట్ ఫ్యాకల్టీగా దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ సంజన్న శుక్రవారం తెలిపారు. ఎంఏ హిస్టరీ 50 శాతం ఉత్తీర్ణత మార్కులను కలిగి ఉన్న వారు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన వారు 14న కళాశాలలో అందజేయాలని సూచించారు.

నేడు పత్తికొండకు రామకృష్ణ రాక

పత్తికొండటౌన్, జూలై 11(ఆంధ్రజ్యోతి): పత్తికొండలో శనివారం జరిగే సీపీఐ మహాసభలకు రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ హాజరవుతున్నట్లు మండల కార్యదర్శి రాజాసాహెబ్, పట్టణ కార్యదర్శి రామాంజనేయులు తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడారు. నాలుగు స్తంభాల కూడలి వద్దకు మాట్లాడనున్నారు. కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

దీపం-2 నగదు జమయ్యేనా..?

● ఇబ్బంది పడుతున్న లబ్ధిదారులు ● మండలంలో 16 వేలకు పైగా అర్హులు



మద్దికెర, జూలై 11 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ వినియోగదారులందరికీ ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు హామీ ఇచ్చింది. ఈ ఏడాది జనవరి నుంచి ఈ పథకం అమలులోకి వచ్చింది. మొదటిసారి కొందరికే నగదు ఖాతాలకు జమ అయింది. ఎక్కువ మందికి జమ కాకపోవడంతో సంబంధిత గ్యాస్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా నగదు జమ కావడం లేదు. మండలంలో మొత్తం 11 గ్రామాలు ఉన్నాయి. వీరందరికీ మద్దికెర గ్రామంలోని భారత్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా జనరల్, దీపం, ఉజ్వల తదితర విభాగాలకు సంబంధించి 16 వేలకు పైగా కనెక్షన్లు ఉన్నాయి. అన్ని రకాల గ్యాస్ వినియోగదారులకు ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు ఇచ్చేందుకు ప్రభుత్వం దీపం-2 పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇందులో జనరల్, దీపం పథకాల లబ్ధిదారులు గ్యాస్ కనెక్షన్లు తీసుకునే సమయంలో సంబంధిత ఏజెన్సీ వారికి నగదు చెల్లించి తీసుకుంటే లబ్ధిదారుని బ్యాంకు ఖాతాలో నగదు జమ అవుతుంది. గ్యాస్ ఏజెన్సీలకు అర్హుల జాబితాను ప్రభుత్వం అందజేసింది.

నాలుగు నెలలకు ఒక సిలిండర్

జనరల్, దీపం పథకం ద్వారా గ్యాస్ కనెక్షన్ తీసుకున్నవారికి సిలిండర్ తీసుకున్న ప్రతిసారి రూ.50ల నగదు ఖాతాకు జమ అవుతుంది. ఉజ్వల పథకం ద్వారా కనెక్షన్ పొందిన లబ్ధిదారుల ఖాతాకు రూ.300 జమ అవుతుంది. గ్యాస్ సిలిండర్‌కు ఎక్కువ కాలం తీసుకోకపోవడంతో పలువురు కనెక్షన్లు పనిచేయకుండా పోయాయి. ఉచిత గ్యాస్ వస్తుందనే కారణంతో నిలిచిపోయిన కనెక్షన్లు తిరిగి వాడుకలోకి తీసుకువచ్చారు. అలాంటి వినియోగదారులకుల నగదు ఇప్పటికీ జమ కాలేదు. ఏడాదిలో నాలుగు నెలలకు ఒక సిలిండర్ చొప్పున తీసుకుంటే రూ.800 బ్యాంకు ఖాతాలకు జమ అవుతుంది. అర్హులైన 4వేల మందిలో మొదటిసారి నగదు ఏప్రిల్‌లోగా జమ కావాల్సిన నగదు కొంత మందికి మాత్రమే జమ అయింది. రెండోసారి నగదు ఇప్పటి వరకు జమ కాలేదని లబ్ధిదారులు పేర్కొం టున్నారు.

ఎదురు చూస్తున్నాం



ప్రభుత్వం దీపం-2 పథకం కింద నాలుగు నెలలకు ఒకసారి గ్యాస్ తీసుకుంటే రూ.832 ఖాతాలో జమ అవుతుందని తెలిపారు. కానీ ఇంత వరకు ఒక్క రూపాయి కూడా జమ కాలేదు. ఎదురు చేస్తున్నాం. మాకు వెంటనే ఇవ్వాలి.
- పర్వీన్, ఎం.అగ్రహారం



కోటకొండలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఇన్‌చార్జీ వీరభద్రగౌడ్



పెండేకల్‌లో ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తున్న టీడీపీ సీనియర్ నాయకులు తుగ్గలి నాగేంద్ర తదితరులు

చంద్రబాబుతోనే సుపరిపాలన సాధ్యం

దేవనకొండ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సీఎం చంద్రబాబుతోనే సుపరిపాలన సాధ్యమని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జీ వీరభద్రగౌడ్ అన్నారు. మండలంలోని పి.కోటకొండలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్ని, గ్రామంలోని ప్రధాన రహదారి, రాంబాయి కాలనీ, ఎస్సీ కాలనీ, కురవగేరిలో ఇంటింటికి వెళ్లి ఏడాది కూటమి పాలన గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. పెరిగిన పింఛను, తల్లికివందనం, ఉచిత గ్యాస్ ఇవ్వడం జరిగిందని, మహిళలకు ఉచిత బస్సు, రైతులకు రైతుసంక్షేమం త్వరలోనే వస్తాయని తెలియజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బడిగింజల రంగన్న,సుభాన్, కప్పట్రాళ్ల మల్లికార్జున, ఆకుల వీరేష్, నీలకంఠగౌడ్, సిద్ద, బాస్కర్, రామప్ప, వల్లే వెంకటేష్, ఎర్రమల రాజు, రుద్ర, తదితరులు పాల్గొన్నారు.

తుగ్గలి: ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ గ్రామాలు అభివృద్ధి చేయడం కూటమి ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి, సీనియర్ నాయకులు తుగ్గలి నాగేంద్ర, రాష్ట్ర కార్యదర్శి బత్తిన వెంకట్రాముడు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పెండేకల్‌లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలు వివరించడంతో పాటు ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం ఏపీలో సమర్థవంతమైన సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే జగన్ ఓర్వలేకపోతున్నాడని తుగ్గలి నాగేంద్ర ఆరోపించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బర్మా వీరేష్, తిరుపాల్ నాయుడు, చంద్రశేఖర్‌యాదవ్, శ్రీనివాసులుగౌడు, వెంకటస్వామి, మసాల శ్రీను, వెంకట్రాముడు చౌదరి, వోలప్ప, నవీన్ తదితరులు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పని చేయాలి : ఎంపీ, ఎమ్మెల్సీ

ఆస్పరి, జూలై 11(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పని చేయాలని ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, నియోజకవర్గ పరిశీలకులు పూల నాగరాజు, అన్నారు. శుక్రవారం మండంలోని తంగరడోణ, నగరూరు, చిగిళి, అలిగేర, బిణిగేర, శంకరబండ, చిరుమాన్‌దొడ్డి, ఆస్పరి, జోహరాపురం, చిన్నహోతూరు గ్రామాల టీడీపీ నాయకులతో సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తమదృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో వాల్మీకి రాష్ట్ర ఫెడరేషన్ చైర్మన్ బుజ్జమ్మ, మండల కన్వీనర్ పరమారెడ్డి, మాజీ ఎంపీటీసీలు కృష్ణయాదవ్, వెంకటేష్, వెంకటోఎచౌదరి, కొకం మధు, ఎస్.తిమ్మన్న, మేకల రంగనాథ్, మాబు పాల్గొన్నారు.

● చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యమని ఎంపీ బస్తిపాటి నాగరాజు, నియోజకవర్గ పరిశీలకులు పూల నాగరాజు, ఎమ్మెల్సీ బీటీనాయుడు, రాష్ట్ర వాల్మీకి ఫెడరేషన్ చైర్మన్ కప్పట్రాళ్ల బుజ్జమ్మ అన్నారు. మండల కేంద్రమైన ఆస్పరిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు కృష్ణయాదవ్, వెంకటేష్, జీవన్‌కుమార్, సంజప్ప, రాజశేఖర్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఆదోని: పరామర్శల పేరుతో అశాంతి, అలజడులు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి మీనాక్షినాయుడు అన్నారు. శుక్రవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా కార్వన్‌పేట్‌లో మీనాక్షినాయుడు ఇంటింటికి తిరిగి ప్రభుత్వం చేపట్టిన పథకాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బాలాజీ, శ్రీనివాస ఆచారి, లక్ష్మినారాయణ, అప్సర్‌బాషా పాల్గొన్నారు.



కరపత్రాలను ప్రజలకు అందజేస్తున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్సీ బీటీనాయుడు, తదితరులు



పథకాల గురించి వృద్ధురాలికి వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు

పత్తికొండలో అంతరాష్ట్ర క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

పత్తికొండ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పత్తికొండలో అంతరాష్ట్ర క్రికెట్ టోర్నమెంటును టీడీపీ నాయకులు సాంబశివారెడ్డి, నరసింహచౌదరి, వెంకటపతి, బత్తినలోక్‌నాథ్ ప్రారంభించారు. టీడీపీ నాయకుడు, రాజీవ్‌నగర్‌కాలనీ(కోయనగర్) పెద్ద సిరివాటి కందనాతి గత కొద్దిరోజుల క్రితం అనారోగ్యంతో మరణించారు. తమకాలనీ అభివృద్ధికి కృషి చేశాడని, కందనాతి సేవలకు గుర్తుగా ఆ కాలనీవాసులు క్రికెట్ టోర్నమెంట్‌ను పత్తికొండ క్రీడామైదానంలో నిర్వహిస్తున్నామని నిర్వాహకులు నిర్వాహకులు కొండపల్లి కుల్లాయి, అగస్త్యమౌళాలి,బలగోల చిన్నలక్ష్మన్న తెలిపారు. 30 టీంలు టోర్నమెంటులో పాల్గొంటున్నాయని తెలిపారు.



పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

చిప్పగిరి , జూలై 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఏరూరు, నేమకల్లు, చిప్పగిరి, ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో టాపర్సగా నిలిచిన విద్యార్థులకు మునీశ్వర ఎడ్యుకేషన్ ట్రస్ట్ అధ్యక్షుడు బండన హాల్ రంగస్వామి రూ. 30 వేల నగదును పంపిణీ చేశారు. ఒక్కో పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులను శుక్రవారం అందించారు. ఆయా పాఠశాల హెచ్ఎంల ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థులైన రంగస్వామి మొదటి బహుమతిగా రూ. 5000, రెండో బహుమతి రూ. 3000, మూడో బహుమతి రూ. 2000 ప్రకారం మూడు పాఠశాలలకు చెందిన విద్యార్థులకు అందించారు. ఈ బహుమతులు చిప్పగిరికి చెందిన అనూష, సుభాన్ బీ, భవాని, ఏరూరు పాఠశాల నుండి రజిని, ఆదిత్య, కార్తీక్, నేమ్‌కల్ నుండి అరవింద్, అమీనా, వీరేష్, బహుమతులను అందుకున్నారు. చిప్పగిరి కస్తూర్బా పాఠశాలకు జడ్పీటీసీ సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు మీనాక్షి నాయుడు రూ. పదివేల విలువచేసే ప్యాన్లను అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు లతీఫ్, ఉపాధ్యాయులు రంగనాయకులు, మునీశ్వర ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఉపాధ్యక్షుడు రాజశేఖర్, ట్రెజరర్ రాము పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న రంగస్వామి

చేనేత డిజైన్‌కు జాతీయ పురస్కారం

ఆదోని టౌన్ , జూలై 11 (ఆంధ్రజ్యోతి) : చేనేత డిజైనర్ జూజారే నాగరాజు(ధర్మవరం)కు కేంద్ర చేనేత, జౌళి మంత్రిత్వ శాఖ 2024వ సంవత్సరానికి జాతీయ పురస్కారం ప్రకటించడం పట్ల ఆదోని చేనేత వర్గాలకు చెందిన స్వకుల సాళే సమాజ్ పెద్దలు, రిటైర్డ్ మునిసిపల్ మేనేజర్ అర్కట్ యువరాజ్ అభినందరించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ, జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఆగస్టు 7వ తేదీన డిల్లీలో జరిగే కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము చేతుల మీదుగా జాతీయ పురస్కారం అందుకోనున్నందుకు రాష్ట్ర చేనేత వర్గాలు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. నాగరాజు 2006లో ఉత్తమ డిజైనర్‌గా రాష్ట్ర ప్రభుత్వం నుంచి కూడా పురస్కారం అందుకున్నారని తెలిపారు.



జాతీయ పురస్కారానికి ఎంపికైన డిజైనర్ జూజారే నాగరాజ్

క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షుడిగా నరేష్



దేవనకొండ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): క్రిష్టియన్, మైనార్టీ మండల సెల్ అధ్యక్షుడిగా తెర్నేకల్ పులి నరేష్‌ను వైసీపీ పార్టీ ప్రకటించింది. పార్టీ అవిర్భావం నుండి సేవ చేసినందుకు తగిన ప్రాధాన్యత ఇచ్చిన్నట్లు నరేష్ హర్షం వ్యక్తం చేశారు.

యూరియా కొరత రానివ్వం

దేవనకొండ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఏవో ఉషారాణి అన్నారు. పి. కోటకొండ, చెల్లెల చెలిమల గ్రామాలలో 300 చొప్పున బస్తాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. అవసరమైన చోట మరిన్ని బస్తాలను తెప్పిస్తామన్నారు.

గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

పత్తికొండటౌన్, జూలై 11(ఆంధ్రజ్యోతి): గణేశ్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ప్రశాంతంగా నిర్వహించుకోవాలని కర్నూలు జిల్లా గణేష్ మహోత్సవ కేంద్ర కమిటీ జిల్లా కార్యదర్శి గోవర్ధననాయుడు కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆగస్టు 27వ తేదీన వినాయక చవితి ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఉత్సవసమితి నిర్వాహకులు సిద్ధం కావాలన్నారు. గణేశ్ మండపాల ఏర్పాటుకు ముందస్తుగా పోలీసుల అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. గణేశ్ ఉత్సవకమిటీ సూచన మేరకు ఉత్సవాలు విజయవంతమయ్యేందుకు నిర్వాహకులు సమయాత్తం కావాలన్నారు.

పూర్వ విద్యార్థుల ఔదార్యం

● రూ. 1.20 లక్షతో పాఠశాల ముఖద్వారం ఏర్పాటు

ఆదోని అగ్రికల్చర్ , జూలై 11 (ఆంధ్రజ్యోతి) : నెహ్రూ మెమోరియల్ పురపాలక ఉన్నత పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. పాఠశాలకు ముఖద్వారం లేకపోవడంతో రూ. 1.20 లక్షలతో 2005-2006 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు నిర్మించారు. ఇటీవల పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. పాఠశాలకు ముఖంద్వారం లేకపోవడం గుర్తించి వారు ముందుకొచ్చి నిర్మించారని ఉపాధ్యాయులు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు శ్రీమాన్, జయ రాం. శాంతప్ప, నాగార్జున, విజయలక్ష్మి, జ్యోతి పాల్గొన్నారు.



నెహ్రూ మెమోరియల్ పాఠశాల పూర్వ విద్యార్థులు ఏర్పాటు చేసిన ముఖద్వారం

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

దేవనకొండ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): దొమ్మర కులస్తులకు ఇళ్లస్థలాలు ఇవ్వాలంటూ సీపీఐ యంయల్ లిబరేషన్ పార్టీ అధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఆపార్టీ జిల్లా నాయకులు మునిస్వామి మాట్లాడుతూ అత్యంత వెనుకబడిన సామాజిక వర్గానికి చెందిన దొమ్మర, బుడగజంగాలు, మొండి జాతులకు చెందిన వారికి ప్రభుత్వాలు మారిన వీరికి మాత్రం న్యాయం చేయలేదన్నారు. దేవనకొండలో 30 కుటుంబాలకు పైగా ఉన్న వీరికి మూడు సెంట్లు స్థలం, ఇంటి నిర్మాణం చేసి ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీనియర్ అసిస్టెంటు రవికుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. ధర్మ, రాము, నాగరాజు, సరోజ, వెంకటేషు,ఈరన్న పాల్గొన్నారు.

సారా స్థావరాలపై దాడులు

పత్తికొండ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): సారా స్థావరాలపై దాడులు నిర్వహించి 1200 లీటర్ల బెల్లంఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ సువర్ణలత తెలిపారు. ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది సంయుక్తంగా శుక్రవారం ఈదాడులు నిర్వహించామని తుగ్గలి మండలంలోని రోళ్లపాడుతాండా, లక్ష్మీతాండ, జాప్లాతాండ, మెథెతాండాలలో ఈదాడులు నిర్వహించామన్నారు. దాడులలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సుభాషిణి, ఎక్సైజ్ ఎస్ఐ రవి, సిబ్బంది ఉన్నారన్నారు.

స్వచ్ఛ ఓటరు జాబితాయే లక్ష్యంగా పనిచేద్దాం

పత్తికొండ, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛ ఓటరు జాబితా తయారుచేయడమే లక్ష్యంగా పనిచేద్దామని తహసీల్దార్ నూర్‌అహ్మద్ బీఎల్వోలకు పిలుపునిచ్చారు. స్వచ్ఛఓటరు తయారీకి సంబంధించి ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో శుక్రవారం బీఎల్వోలకు శిక్షణ తరగుతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మద్దికెర తహసీల్దార్ గుండాలనాయక్ బీఎల్వోలకు శిక్షణను అందించారు. ప్రస్తుతం ఉన్న డబుల్‌ఎంట్రీలతోపాటు తప్పుడు ఓటరుపేర్లను తొలగించడంతోపాటు స్వచ్ఛఓటరు జాబితా తయారికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. అనంతరం శిక్షణకు హాజరైన బీఎల్వోలకు శిక్షణానైపుణ్యపత్రాలను అందించారు. ఈకార్యక్రమంలో డిటీ లక్ష్మి, ఆర్ఐ వీరేష్ తదితరులు ఉన్నారు.



బీఎల్వోలకు ప్రశంసా పత్రాలను అందిస్తున్న దృశ్యం

ప్రభుత్వ పథకాల అమలుకు సహకరించండి

ఆదోని టౌన్ , జూలై 11 (ఆంధ్రజ్యోతి) : స్థానిక 19వ వార్డులోని మండిగిరి సచివాలయంకు బదిలీపై వచ్చిన కొత్త సిబ్బందిని కూటమి నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వం ప్రకటించి అమలు చేస్తున్న వివిధ పథకాలను అర్హులు అందరికీ సక్రమంగా అందేలా విధులు నిర్వహించాలని నాయకులు సిబ్బందిని కోరారు. మాజీ కౌన్సిలర్, టీడీపీ మండిగిరి ఇన్‌చార్జి శ్రీనివాస ఆచారి, జనసేన ఇన్‌చార్జి మంజు బూత్ కన్వీనర్ డిష్ ఈరన్న, డిష్ రవి, చాంద్, సురేంద్ర తదితురులు పాల్గొన్నారు.

రూ.40 వేల వైద్య పరికరాల వితరణ



వైద్యపరికరాలు అందజేస్తున్న దృశ్యం

వెల్దుర్తి, జూలై 11(ఆంధ్రజ్యోతి): వెల్దుర్తి సామాజిక ఆరోగ్య కేంద్రానికి పట్టణానికి చెందిన షేక్ అలీలాల్ తన తండ్రి లాలుబాషా(ఆర్టీసీ కండక్టర్) జ్ఞాపకార్థం రూ.40 వేలు విలువ చేసే ఐసీయూ బెడ్ సెట్, వీల్ చైర్, సక్షన్ మెషీన్‌ను శుక్రవారం డాక్టర్ బాలచంద్రారెడ్డికి అందజేశారు. అలీలాల్ మాట్లాడుతూ దాతలు ముందుకొచ్చి ప్రభుత్వ ఆసుపత్రికి తమ వంతు విరాళాలు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు రంగస్వామి, సాహిత్య, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

రస్తా వివాదాలను పరిష్కరిస్తాం

దేవనకొండ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పొలాలకు వెళ్లే రస్తా వివాదాలు పరిష్కరిస్తామని తహసీల్దార్ రామాంజీనేయులు అన్నారు. ఎ. కోటకొండ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 643లో పొలాలకు వెళ్లే రస్తాలో డ్రైనేజీ నీరు పారుతుండటం వల్ల పొలాలకు వెళ్లేందుకు లేకపోవడంతో రైతులు అంజినేయ, నాగప్ప, జయరాముడు, కౌలుట్ల జేసీకు పిర్యాదు చేశారు. తహసీల్దార్ గ్రామానికి చేరుకొని రస్తాని పరిశీలించారు. రస్తాలో డ్రైనేజీ నీరు పారకుండా చర్యలు చేపట్టిన అనంతరం సర్వేచేసి రస్తా పూర్తి వివరాలు తేలియజేస్తామన్నారు.

ప్రసన్నకుమార్ రెడ్డిని అరెస్టు చేయాలి

- ఆలూరు పోలీస్‌స్టేషన్‌లో టీడీపీ నాయకురాలు వైకుంఠం జ్యోతి ఫిర్యాదు



సీఐ రవిశంకర్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తున్న టీడీపీ మహిళా నాయకురాలు వైకుంఠం జ్యోతి

ఆలూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై వైసీపీ మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు అత్యంత అవమానకరంగా ఉన్నాయని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్, టీడీపీ మహిళా నాయకురాలు వైకుంఠం జ్యోతి అన్నారు. శుక్రవారం సాయంత్రం ఆలూరు పోలీస్‌స్టేషన్‌లో సీఐ రవిశంకర్‌రెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. ప్రసన్నకుమార్ చేసిన వ్యాఖ్యల వల్ల రాష్ట్రంలో మహిళల మనోభావాలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. దూషించడం, బూతులు తిట్టడం, కించపరచడాన్ని వైసీపీ రాజకీయ సిద్ధాంతంగా పెట్టుకుందని విమర్శించారు. మహిళలపై వ్యక్తిగత విమర్శలు చేసి వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ప్రవర్తిస్తున్న వారు అసలు మనుషులేనా అని ప్రశ్నించారు.

హంద్రీ తీరం.. వసతులు లేక దైన్యం

పర్యాటకులకు కనీస వసతులు కరువు ● ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా పట్టించుకోని అధికారులు ● పర్యాటకాన్ని పునరుద్ధరించాలని కోరుతున్న ప్రజలు

గోనెగండ్ల, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పండుగలు, వారంతపు సెలవు దినాల్లో గాజులదిన్నె ప్రాజెక్టు హంద్రీ నది తీరం సందర్శకులు, పర్యాటకులతో కళకళలాడుతూ రద్దీగా ఉంటోంది. ప్రధానంగా ఆదోని డివిజన్ ప్రాంతంలో చెప్పుకోదగ్గ పర్యాటక ప్రాంతంగా గాజులదిన్నె ప్రాజెక్టు హంద్రీనది పరివాహక ప్రాంతం. పండుగలు, సెలవుదినాలలో కోడుమూరు, ఎమ్మిగనూరు, ఆదోని, కర్నూలు, బెళగల్, గూడురు ప్రాంతాలకు చెందిన పర్యటకులు ఎక్కువగా వస్తుండటంతో ప్రాజెక్టు పరిసర ప్రాంతం రద్దీగా ఉంటుంది. అయితే పర్యాటకులకు అవసరమైన సదుపాయాలు ఇక్కడ లేవు. దీంతో పర్యాటకులు ఇబ్బందులు పడుతుంటారు. పిల్లలకు ఆడుకునేందేకు ఆట వస్తువులు, లేక పోవడం, మహిళలకు మరుగుదొడ్లు లేకపోవడంతో వచ్చిన పర్యాటకులకు అవసరమైన గదులు లేక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. పలు మార్లు రాజకీయ నాయకులు ప్రాజెక్టు పరిసరాలను సందర్శించడం పర్యటక రంగంగా తీర్చి దిద్దుతామని హామీ ఇవ్వడం పోవడం పరిపాటిగా మరింది.



నదీతీరంలో సందడి చేస్తున్న పర్యాటకులు



కళ కోల్పోయిన నీలగిరి తోట

జీడీపీ స్నానం చేస్తే కృష్ణానదిలో చేసినట్లే

ప్రాజెక్ట్ పరిసర ప్రాంతం నీటి వసతి కలిగి ఉంది. దీంతో పర్యటకులు స్నానం చేసేందుకు ఇష్టపడతారు. పిల్లలు ఈత ఆడేందుకు ఎంతో ఆసక్తి చూపుతారు. ప్రాజెక్టుకు శ్రీశైలం బ్యాక్ వాటర్‌ను హంద్రీనీవా పథకం (హెచ్ఎన్ఎస్) ద్వార జీడీపీకి తరలిస్తుండటంతో చాలా మంది జీడీపీలో స్నానం చేస్తే కృష్ణానదిలో స్నానం చేసినట్లేనని భావించి, చాలామంది ఇక్కడికి వస్తుంటారు. గోనెగండ్ల, గాజులదిన్నె తదితర ప్రాంతాల యువకులు, ప్రజలు ఉదయం పూట వాకింగ్ వచ్చి జీడీపీ నీటిలో స్నానం చేస్తారు.

ఇవీ సమస్యలు

ఇక్కడ ఒకటి అతిథి గృహం ఉన్నప్పటికీ అది వాడుకలో లేదు. సమీపంలో ఏ వసతులు లేక పోవడంతో మహిళలు, చిన్న పిల్లలు దుస్తులు మార్చుకునేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అలాగే మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక పోవడంతో సమస్యగా మారింది. ఇక్కడ ప్రమాదాలు జరిగితే ఆదుకునేందుకు బోటు తదితర సౌకర్యాలు లేవు. అప్రమత్తంగా ఉండాలని సూచించేందుకు వాచ్‌మెన్‌ను కూడా ప్రభుత్వం ఏర్పాటు చేయలేదు. చీకటి పడితే ఒక్క విద్యుత్ దీపం కూడా వెలగదు. పర్యటక కేంద్రంను సూచించే పైలాన్ ఉంది. దానిపై హైమాస్ట్ దీపం ఉన్నప్పటికీ అది వెలిగిన దాఖలాలు లేవు. పిల్లలు ఆడుకునేందుకు గతంలో కొబ్బరితోట, నీలగిరి తోట, ఉండేవి అవి ప్రస్తుతం కనీస నిర్వహణ లేక పోవడంతో రూపం కోల్పోయాయి.

ప్రభుత్వ నిధులు మంజూరు

ప్రభుత్వం ఏర్పాటు అయిన తరువాత పర్యటక కేంద్రంను అభివృద్ధి చేసేందుకు గాను 100 రోజలు ప్రణాళిక కింద గాజులదిన్నె ప్రాజెక్టు పర్యాటక రంగం కు రూ. 3 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటనలు వెలువడ్డాయి. ఇందుకు గాను పర్యటక శాఖ వారు పార్కు, పిల్లలు ఆడుకునే వస్తువులు, మహిళలకు మరుగు దొడ్లు, మూత్రశాలలు, దుస్తులు మార్చు కునేందుకు గాను గదులు నిర్మించేందుకు గాను సర్వేలు చేశారు. ఇందుకు జీడీపీ అధికారులు స్థలం కూడా చూపించారు. అయితే పనులు మాత్రం ఇప్పటి వరకు ప్రారంభ ం కాలేదు.

ప్రత్యేక నిధులు కేటాయించాలి



గాజులదిన్నె పర్యాటక రంగానికి టీడీపీ ప్రభుత్వం ఇప్పుడు విడుదల చేసిన నిధులకు మరింత నిధులు విడుదల చేసి జిల్లాలో ప్రత్యేక పర్యాటక రంగంగా తీర్చిదిద్దాల్సిన అవసం ంది. ప్రభుత్వం రూ. 3 కోట్లు కేటాయిం చడం అభినందనీయం.

● శ్రీనివాసులనాయుడు, గాజులదిన్నె

పనులు చేపట్టాలి



ప్రభుత్వం జీడీపీ పర్యాటక రంగానికి నిధులు కేటాయించి పర్యాటకులకు కావాల్సిన సదుపాయాలు వెంటనే ఏర్పాటు చేయాలి. గతంలో ప్రభుత్వాలు, రాజకీయ నాయకులు రావడం పర్యటిం చడం మాట ఇవ్వడం పోవడం జరుగుతుంది. ఇప్పటి కైనా నాయకులు స్పందించాలి. పర్యాటకులకు వసతులు కల్పించాలి.

- బడేసానాయుడు, గోనెగండ్ల

గ్రామాభివృద్ధికి ప్రభుత్వం కృషి



మాధవరంలో కరపత్రాలు అందజేస్తున్న టీడీపీ నాయకులు

మంత్రాలయం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి బారిక్ ఉరుకుందు, పోతురాజు నరసింహులు, పాల్ దినకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని మాధవరం గ్రామంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, మాజీ సర్పంచ్ రఘునాథరెడ్డి, రామకృష్ణారెడ్డి ఆదేశాల మేరకు మాధవరంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్ర మం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రామయ్య, దావీదు, చిట్టెమ్మ, యశోదమ్మ, ఈరమ్మ, సువర్ణ, శిరోమణి, మాణిక్యమ పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చి ఓట్లు అడుగుతాం



అభివృద్ధి గురించి వివరిస్తున్న నాయకులు

ఎమ్మిగనూరు రూరల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన తర్వాతే ఓట్లు అడుగుతామని మాజీ ఎంపీపీ శంకరయ్య, మండల టీడీపీ అధ్యక్షులు కె.టి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కొటేకల్లు గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఇంటింటికి తిరుగుతూ ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను వివరించారు. కూటమి ప్రభుత్వం పేదలకు అందజేసిన సంక్షేమ పథకాలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు నాగయ్య, టీడీపీ నాయకులు చెన్నాపురం నాగరాజు పాల్గొన్నారు.

పత్తి రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

గోనెగండ్ల, జూలై 11(ఆంధ్రజ్యోతి): బావులు బోర్ల దగ్గర సాగు చేసిన పత్తి పంటకు గులాబీ రంగు పురుగు సోకిందని, పత్తి రైతులు జాగ్రత్తలు పాటించాలని ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, ఏవో హేమలత కోరారు. శుక్రవారం మండల పరిధిలోని పలు గ్రామాల్లోని పత్తి పొలాలో వారు పర్యటించారు. పత్తికి ప్రస్తుతం సోకుతున్న చీడపీడలను గుర్తించారు. వారు మాట్లాడుతూ ఎమ్మిగనూరు నియోజకవర్గంలో ఎక్కువగా పత్తి పంటను రైతులు సాగు చేశారు. అయితే పత్తి పంటకు ప్రస్తుతం గులాబి రంగు పురుగు సోకింది. దీంతో పంట దిగుబడి తగ్గిపోయే ప్రమాదం ఉంది కాబట్టి రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. వ్యవసాయశాఖ అధికారుల సలహాలు పాటించాలని కోరారు. పత్తి రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలను పాటించాలని కోరారు.

బహిరంగ సభకు తరలిన నాయకులు

నందవరం, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరులో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆర్డీఎస్ ప్రాజెక్టు కోసం శుక్రవారం తలపెట్టిన బహిరంగ సభకు నందవరం నాయకులు బయలు దేరారు. ఎమ్మెల్యే బీవీ ఆర్డీఎస్ ప్రాజెక్టు విశిష్టత గురించి, పశ్చిమ ప్రాంతంలోని రైతులకు సాగు, ప్రజలకు తాగునీరు అందుతున్న విదానం గురించి వివరిస్తుండంతో రైతులు వందలాదిగా తరలివెళ్లారు. కార్యక్రమంలో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి దేశాయిమాదవరావు, మాజీ జడ్పీటీసీ సభ్యులు ముగతి ఈర్నగౌడు, పార్టీ మండల కన్వీనర్ కాశీంవలి, రైస్ మిల్ నారాయణరెడ్డి, లచ్చప్ప నాయుడు, బీజేపీ నాయకులు జగ్గాపురం ఈరన్న, కడుభూరి, కొండయ్య పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

కోసిగి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మూగలదొడ్డి గ్రామంలో ఆదోని మండలం పెద్దహరివాణం గ్రామానికి చెందిన బలారప్ప అనే యువకుడు మొహర్రం పండుగకు తన అత్తగారింటికి వచ్చాడు. కుటుంబ కలహాలతో శుక్రవారం ఉదయం పొలంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడటంతో వెంటనే బంధువులు గమనించి కోసిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో ఆదోని ఆసుపత్రికి తరలించారు. కుటుంబ కలహాలతో ఈఘటనకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కాశీంవలికి సన్మానం

నందవరం, జూలై 11(ఆంధ్రజ్యోతి): నూతనంగా ఎన్నికైన టీడీపీ నందవరం మండల పార్టీ కన్వీనర్ కాశీంవలిని మైనార్టీలు శుక్రవారం జామియా మసీదులో ఘనంగా సన్మానించి బోకే ఇచ్చి సన్మానించారు. మతపెద్దలు మాట్లాడుతూ ఇలాంటి పదవులు ఎన్నో అలంకరించి పేదలకు న్యాయం చేసి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మసీదులో దువా చదివారు. కార్యక్రమంలో టైలర్ల సంఘం మండల అధ్యక్షుడు వలీ, మైనార్టీ మండల నాయకులు షరీఫ్, ఈష, రహిమాన్ పాల్గొన్నారు.

బీఎల్‌వోలకు శిక్షణ



మాట్లాడుతున్న మంత్రాలయం అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి

పెద్దకడబూరు, జూలై11(ఆంధ్రజ్యోతి): మండలంలోని బీఎల్‌వోలకు శుక్రవారం స్థానిక చంద్రమ్మ భవనంలో మంత్రాలయం అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి అనురాధ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటర్ల నమోదుకు సంబంధించిన విధి విధానాలతో పాటు బూత్‌స్థాయి పనితీరులో అవలంబించాల్సిన నిబంధనలు, ఎన్నికల సంఘం మార్గదర్శకాల వంటి విషయాలపై సమగ్రంగా వివరించారు. ఓటరు నమోదు నిర్వహణలో అత్యంత కీలకం బీఎల్‌వోలే అన్నారు. శిక్షణా అనంతరం పరీక్షలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గీతా ప్రియదర్శిని, ఎన్నికల డీటీ గురురాజారావు, శిక్షకులు కన్నడ రాజారావు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి

మంత్రాలయం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రమైన మంత్రాలయానికి చెందిన దాదాపు 15 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. శుక్రవారం టీడీపీ నాయకులు వరదరాజులు, అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో గొల్ల రవి, జంగం వీరభద్ర, రవి, వెంకటేశ్, విరుపాక్షి, గోవిందు, నవీన్, గురు, రమేష్, లక్ష్మన్న, భీమేష్, తిమ్మారెడ్డి, శివకుమార్, విజయ్, గురురాజులకు మాధవరం రాఘవేంద్రరెడ్డి నివాసంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరుతున్న వారికి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, మంచాల సింగిల్ విండో చైర్మన్ రామకృష్ణారెడ్డిలు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు చూసి వైసీపీని వీడి టీడీపీలో చేరుతున్నట్లు గొల్ల రవి, జంగం వీరభద్ర వారి బృంధం తెలిపారు. ఈ కార్యక్రమంలో కంసాలి నరసింహ, శివ, రఘు, రాకేష్ రెడ్డి, రామకృష్ణ, వంశీ, జయరాం, తదితరులు పాల్గొన్నారు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పనులపై పరిశీలన

పెద్దకడబూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): పెద్దకడుబూరులోని కల్లుకుంట గ్రామంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన అభివృద్ధి పనులను శుక్రవారం కేంద్ర బృందం సభ్యులు సంతోష్‌పరిద, సూర్యకాంత్‌ప్రధాన్ విచారణ చేపట్టారు. జిల్లాలోని పెద్దకడుబూరు మండలంలో రెండు గ్రామాలను ఎంపిక చేయడం జరిగిందన్నారు. వారి వెంట ఎంపీడీవో ప్రభావతి, ఏపీడీ లోకేశ్వర్, హౌసింగ్ డీఈ లాల్‌కృష్ణయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయికుమార్, ఈవోపీఆర్డీ జయరాముడు, ఏపీవో చంద్రశేఖర్, ఏపీఎం శ్రీనివాసులు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సీవో నరసప్ప పాల్గొన్నారు.

తిమ్మప్ప మృతి పార్టీకి తీరని లోటు

నందవరం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మాచాపురంలో టీడీపీ నాయకుడు బాలగుడ్డ తిమ్మప్ప మృతి పార్టీకి తీరని లోటని టీడీపీ పార్టీ కన్వీనర్ కాశీంవలీ, యవ నాయకులు వలీ, మాజీ విద్యాకమిటి చైర్మన్ పీరసాబ్, గ్రామ టీడీపీ అధ్యక్షుడు రంజాన్ అన్నారు. శుక్రవారం ఆయన మృతదేహం దగ్గర నివాళి అర్పించారు. అర్పించిన వారిలో సుదాకర్‌రెడ్డి, దావీదు, భూపతి, చిన్నన్న పాల్గొన్నారు.

వైసీపీ లీగల్ సెల్ అధ్యక్షుడిగా గురురాజ్

ఎమ్మిగనూరు టౌన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ పట్టణ లీగల్ సెల్ అధ్యక్షుడిగా గురురాజ్ ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా ఆయన పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి బుట్టా రేణుక, సీనియర్ బుట్టా నీలకంఠకు, రాష్ట్ర యువ విభాగ ఉపాధ్యక్షుడు బుట్టా ప్రతుల్‌కు కృతజ్ఞతలు తెలిపారు ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు నాగేషప్ప, పట్టణ ఉపాధ్యక్షులు కోటకొండ నరసింహులు కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రహ్లాదరాయలకు వెండి రథోత్సవం



వెండి రథంపై విహరిస్తున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, జూలై 11(ఆంధ్రజ్యోతి): శ్రీమఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు వెండి రథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. శుక్రవారం ఆషాడమాస పాడ్యమి శభదినాన్ని పురస్కరించుకుని శ్రీ మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆశీస్సులతో అర్చకులు బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బృందావనాన్ని బంగారు, వెండి, పట్టువస్త్రాలు,ప్రత్యేక పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. పూర్ణబోధపూజ మందిరంలో ఉత్సవమూర్తికి పాదపూజ చేసి పల్లకిలో ఊరేగించారు. అనంతరం వెండి రథంను వివిధ పుష్పాలతో చూడ ముచ్చటగా అలంకరించి, వేద పండితుల మంత్రోచ్చరణాలు, మంగళ వాయిద్యాల మధ్య ప్రహ్లాదరాయలను అధిష్టించి పండితుల మహామంగళహారతులు ఇచ్చి ఆలయ ప్రాంగణ ం చుట్టూ ఊరేగించారు. అనంతరం ఊంజల మంటపంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలను అధిష్టించి ఊంజలసేవ నిర్వహించారు.

ధార్మిక పర్యటనకు వెళ్లిన పీఠాధిపతి

పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ధార్మిక పర్యటనలో బాగంగా శనివారం సాయంత్రం బెంగళూరుకు బయలు దేరి వెళ్లారు. ఉదయం నుంచి పూజలు ముగించుకొని తన శిష్యబృందంతో ధార్మిక పర్యటనకు వెళ్లారు. పర్యటన ముగించుకొని మంగళవారం మంత్రాలయం కు చేరుకుంటారని మఠం ఏఏఓ మాధవశెట్టి, మఠం మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు,వెంకటేష్ జోషి తెలిపారు.

సామూహిక సప్త ముద్రధారణ : పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ధార్మిక పర్యటనలో బాగంగా శుక్రవారం కర్నాటక లోని హుబ్లీ,దార్వాడ లోని భక్తులకు సామూహిక సప్తముద్రదారణ చేశారు. అక్కడి అధికారులు, పండితులు మంత్రాలయం పీఠాధిపతికి పంచఅశ్వవాహన రథంపై ఘనంగా ఊరేగించి స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు.

● రాఘవేంద్రుని సన్నిధిలో నెల్లూరు

వినియోగదారుల కమిషన్ జిల్లా జడ్జి: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం నెల్లూరు జిల్లా వినియోగదారుల కోర్టు జడ్జి రెడ్డి శేఖర్ శుక్రవారం రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. మహాముఖ ద్వారం వద్ద మఠం అధికారులు ఐపీ నరసింహామూర్తి, వ్యాసరాజ ఆచార్, జయతీర్థ ఆచార్ ఘనంగా స్వాగతం పలికారు.

దుద్దిలో డంపింగ్ యార్డు కోసం స్థల సేకరణ

కోసిగి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దుద్ది గ్రామ పంచాయతీలో డంపింగ్ యార్డు కోసం స్థలాలను పరిశీలించినట్లు ఎంపీడీవో ఈశ్వరయ్య స్వామి తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని దుద్ది గ్రామంలో గ్రామ సర్పంచ్ లక్ష్మి సమక్షంలో రోడ్లపై పడిన చెత్తను పరిశీలించి గ్రామంలో డంపింగ్ యార్డు కోసం స్థలాన్ని సేకరించి శనివారం గ్రామంలో రోడ్లపై చెత్తాచెదారం లేకుండా డంపింగ్ యార్డులో చెత్తను వేయాలని పంచాయతీ కార్యదర్శికి తెలియజేసినట్లు ఎంపీడీవో తెలిపారు.

ఓటరు జాబితాపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న తహసీల్దారు శ్రీనివాసులు

నందవరం, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితాపై బూత్ లెవల్ అధికారులకు అవగాహన ఉండాలని తహసీల్దారు శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రమైన నందవరం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో పుల్లయ్య అధ్యక్షతన బీఎల్‌వోలకు, అధికారులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం జరిగింది. సమావేశంలో ఈవోపీఆర్డి సందీప్, డిప్యూటీ తహసీల్దారు శశిశేఖర్‌రావు, సీనియర్ అసిస్టెంట్ కృష్ణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ మోసాలు ప్రజలకు చెబుతాం



మాట్లాడుతున్న వైసీపీ మండల కన్వీనర్ కృష్ణారెడ్డి

గోనెగండ్ల, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ప్రజలకు హామీలు ఇచ్చి నేటికి అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్న టీడీపీ బాగోతం ప్రజలకు తెలియజేయాలని మాజీ ఎంపీపీ మండల వైసీపీ కన్వీనర్ కృష్ణారెడ్డి, జిల్లా యాక్టివిటీ కార్యదర్శి బందేనవాజ్, బీసీ సెల్ తాలుకా అధ్యక్షుడు మురళినాయుడు, అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన గోనెగండ్లలోని వైసీపీ కార్యాలయం నందు మండల స్థాయి విస్తృత సమావేశం మండల కన్వీనర్ ఆధ్యక్షత జరిగింది. కార్యక్రమంలో నాయకులు కాశిరెడ్డి, చికెన్‌రాజ, మన్సూర్, భాస్కర్‌రెడ్డి, దొరబాబు, కులుమాల శ్రీనివాసులు, గోవిందు, ఉరుకుందరెడ్డి, నద్దిముల్లా, మాబువలి, రంగారెడ్డి, రాముడు పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యుత్ సమయాల్లో మార్పు

కోసిగి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 12 నుంచి 17వ తేదీ వరకు కోసిగి మండలంలో రైతులకు ఇస్తున్న 9 గంటల విద్యుత్ పగటి వేళ సమయాల్లో మార్పులు చేస్తున్నట్లు విద్యుత్ ఏఈ వీరేష్ తెలిపారు. శుక్రవారం ఆయన కోసిగిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 220 కేవీ ఏపీ కార్బైడ్ నుంచి 132 కేవీ విద్యుత్ ఫీడర్‌లో మరమ్మతుల దృష్ట్యా వ్యవసాయానికి విద్యుత్ సరఫరా వేళలో మార్పులు చేస్తున్నామనీ, ఈ విషయాన్ని మండల రైతులు గమనించి సహకరించాలని తెలిపారు. అలాగే శనివారం కోసిగిలో విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 9 నుంచిమధ్యాహ్నం 1గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని, కోసిగి మండల ప్రజలు గమనించి సహకరించాలని ఏఈ వీరేష్ తెలిపారు.

ఆసుపత్రి నిర్మాణం చేపట్టాలి



తహసీల్దారుకు వినతి పత్రం ఇస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

మంత్రాలయం, జూలై 11(ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలో 30 పడకల ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణం పనులు చేపట్టాలని ఏఐవైఎఫ్ మండలాధ్యక్ష, కార్యదర్శులు చిన్న, రాజు డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దారు రమాదేవికి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రాలయం ప్రజలకు, దర్శనార్థం వచ్చేభక్తులకు ఎన్నో ఏళ్లుగా ఆస్పత్రి లేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో 30 పడకల ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణానికి శ్రీరాఘవేంద్రస్వామి మఠం ఎకరా స్థలాన్ని కేటాయించిందని తెలిపారు. శ్రీమఠం అధికారులు, ప్రభుత్వ అధికారులు స్పందించి ఆస్పత్రి నిర్మాణం పనులు చేపట్టలేని పక్షంలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు మురళి, ప్రాణేష్, తిమ్మప్పలు పాల్గొన్నారు.

ఆర్డీఎస్‌ను వైసీపీ నాశనం చేస్తే..

టీడీపీ మళ్లీ జీవం పోసింది : ఎమ్మెల్యే



సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

ఎమ్మిగనూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): కర్నూలు పశ్చిమప్రాంత జీవనాడి అయిన ఆర్డీఎస్ కుడికాలువ నిర్మాణానికి నాటి తెలుగుదేశం ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే.. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో ప్రాజెక్టును సర్వనాశనం చేసిందని.. నేడు కూటమి ప్రభుత్వం తిరిగి ఆ ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టాలని నిర్ణయం తీసుకోవటం హర్షణీయమని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి అన్నారు. కర్నూలు జిల్లాలోని ఆర్డీఎస్ కుడికాలువ నిర్మాణ పనులు కొనసాగించేందుకు మంత్రిమండలి ఆమోదం తెలపటంతో శుక్రవారం ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నిత్యం కరువుతో అల్లాడుతున్న కర్నూలు జిల్లా పశ్చిమప్రాంత రైతులకు సాగునీరు అందించేందుకు టీడీపీ ప్రభుత్వం 2019లో ఆర్డీఎస్ కుడికాలువ నిర్మాణానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఇందుకు గాను అప్పట్లో సీఎం చంద్రబాబు నాయుడు రూ. 1985కోట్లు నిధులు మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ మల్లయ్య, పట్టణ అధ్యక్షుడు మహేష్, నాయకులు మాధవరావు దేశాయ్, ఈరన్న గౌడ్, నారాయణ రెడ్డి, కౌన్సిలర్ రామదాసుగౌడ్, మిఠాయి నరసింహులు, తిరుపతయ్య నాయుడు, ఎస్వీ రామాంజనేయులు, కాశీం వలి, శివశంకర్, మహేంద్ర బాబు, కలీముల్లా, కటారి రాజేంద్ర, మిన్నప్ప, బుగిడే నాగరాజు, బచ్చాల రంగన్న, ఉరుకుందు, రంగస్వామి గౌడ్, కామర్తి మహేశ్ పాల్గొన్నారు.